PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 312 | విజయవాడ, శనివారం 14 జూన్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 14 June 2025 | Rs

ఇజ్రాయిల్ దాడులకు ముగింపు పలకాలి

- ఇరాన్‌పై దాడులను తీవ్రంగా నిరసించిన సిపిఎం

7

ఇజ్రాయిల్ దాడులతో టెహ్రాన్‌లోని నోబోన్యాడ్ స్క్వేర్ వద్ద దెబ్బతిన్న భవనాలను చూస్తున్న స్థానికులు

పేట్రేగిపోతున్న ఇజ్రాయిల్

ఇరాన్ అణుకేంద్రాలుసహా పలు ప్రాంతాలపై దాడులు

- ఆర్మీ చీఫ్, రివల్యూషనరీ గార్డు చీఫ్, ఆరుగురు అణు శాస్త్రవేత్తలు సహా పలువురు మృతి
- ఇది యుద్ధాన్ని ప్రకటించడమేనన్న ఇరాన్ • కఠినమైన శిక్ష తప్పదన్న ఖమేని
- తొందరగా ఒప్పందం కుదుర్చుకోవాలన్న ట్రంప్ • పలు దేశాల ఖండన

టెల్ అవీవ్, టెహరాన్ : అమెరికా దన్నుతో ఇజ్రాయిల్ పేట్రేగిపోతోంది. రెచ్చగొట్టే రీతిలో ఇరాన్ అణుకేంద్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిపిన భీకర దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా తీవ్రస్థాయికి చేరాయి. యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్ రాజధాని టెహరాన్ సహా పలు ప్రధాన నగరాల్లో, ప్రాంతాల్లో దాడులు జరిగాయి. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత మొదటి దాడి జరగగా, శుక్రవారం ఉదయం కూడా దాడులు కొనసాగాయి. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిలో రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ హుస్సేన్ సలామి, ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మహమ్మద్ బఘెరి, ఆరుగురు అణు శాస్త్రవేత్తలు మరణించారు. మరో 95 మంది గాయపడ్డారు. ఇతర నివాస ప్రాంతాల్లో కూడా దాడులు జరిగాయని తెలిపింది. పలు అణు కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి ఫ్యాక్టరీలు, మిలటరీ ఆస్తులనే లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ మిలటరీ వర్గాలు తెలిపాయి. టెహరాన్‌లో పలుమార్లు పేలుళ్ల శబ్దాలు వినిపించాయని ఇరాన్ మీడియా పేర్కొంది. ఇరాక్ సరిహద్దుకు సమీపంలో కెర్మాన్‌షా ప్రాంతంలో భూగర్భంలో బాలిస్టిక్ క్షిపణులు నిల్వ చేసిన ప్రాంతంపై దాడి జరిగిన వీడియో దృశ్యాలు బయటకు వచ్చాయి. టెహరాన్‌కు పశ్చిమంగా అల్‌బోర్జ్ ప్రావిన్స్‌లో కూడా పలు చోట్ల పేలుళ్ల శబ్దాలు, దట్టమైన పొగ కమ్ముకున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని మీడియా తెలిపింది.

కఠిన శిక్షను ఎదుర్కోనాల్సిందే : ఇరాన్

ఇజ్రాయిల్ కఠిన శిక్షను ఎదుర్కొనాల్సి వుంటుందని, తమ ప్రతిస్పందన కూడా అత్యంత శక్తివంతంగా వుంటుందని ఇరాన్ మతపెద్ద ఆయతుల్లా అలీ ఖమేని ప్రకటించారు. ఇది యుద్ధాన్ని ప్రకటించడమే అని వ్యాఖ్యానించారు. ఈ దాడులకు ప్రతిస్పందించే చట్టబద్ధమైన హక్కు ఇరాన్‌కు వుందని పేర్కొన్నారు. ఈ దాడులకు సమాధానంగా వందలాది డ్రోన్లతో, క్షిపణులతో ఇజ్రాయిల్‌పై దాడికి సిద్ధమయింది. దాదాపు వంద డ్రోన్‌లను ఇరాన్ ప్రయోగించిందని, తమ సైన్యం వాటిని అడ్డగిస్తోందని ఇజ్రాయిల్ మిలటరీ తెలిపింది. వెంటనే ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ ప్రజలు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ఇది పిరికిపంద చర్య అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి ఖండించారు. కువైట్ విదేశాంగ మంత్రితో ఫోన్‌కాల్‌లో మాట్లాడుతూ ఆయన, దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రజలను భద్రతను రక్షించుకోవడానికి పూర్తి కృత నిశ్చయంతో వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ ఉన్నత సైనికాధికారులు అండర్‌గ్రౌండ్‌లో సమావేశమయ్యారు. ఇజ్రాయిల్ దాడులు, తదనంతర పరిణామాలపై చర్చిస్తున్నారు.

ఆపరేషన్ కొనసాగుతుంది : నెతన్యాహు

ఇరాన్ తమ దేశంపై డ్రోన్‌లు, క్షిపణులతో ప్రతి దాడులకు దిగే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్త చర్యగా ఇజ్రాయిల్ దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా తమ దౌత్య కార్యాలయాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. కాన్సులర్ సేవలేవీ అందుబాటులో వుండవని తెలిపింది. ఇరాన్ భూభాగంలో నిర్దేశిత లక్ష్యాలపై దాడులు కొనసాగుతున్నాయని ఇజ్రాయిల్ ఆర్మీ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి నెతన్యాహు ఈ దాడులను "ఆపరేషన్ రైజింగ్ లయన్" గా అభివర్ణించారు. అవసరమైనంత కాలం ఈ మిలటరీ ఆపరేషన్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. టెలివిజన్‌లో ప్రసంగిస్తూ ఆయన, ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఆపాలని ఆరు మాసాల క్రితమే ఆదేశించామని, తమ దేశాన్ని రక్షించుకునేందుకే ఇరాన్‌పై దాడిచేశామని అన్నారు. ముందుగానే అమెరికాకు తెలియజేశామని, ఇక ఇప్పుడేం చేస్తుందో వారి ఇష్టమని వ్యాఖ్యానించారు. తమ 200 యుద్ధ విమానాలు ఇరాన్‌లోని 100 లక్ష్యాలను ఛేదించాయని ఇజ్రాయిల్ సైన్యం మిగతా 7లో

ఊహించని విషాదం

విమాన ప్రమాద ఘటనా స్థలానికి ప్రధాని మోడీ

బ్లాక్ బాక్స్ లభ్యం.. కీలక సమాచారంపై ఉత్కంఠ

- 241 మంది ప్రయాణికుల మృతి
- గుర్తింపు కోసం డిఎన్ఎ టెస్ట్
- 72 గంటల తర్వాతే బంధువులకు అప్పగింత
- ఆస్పత్రి ఎదుట పడిగాపులు

మెడికల్ కళాశాల హాస్టల్‌పై చిక్కుకొన్న విమాన శకలాలను పరిశీలిస్తున్న ప్రధాని మోడీ

అహ్మదాబాద్: ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనాస్థలిని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిశీలించారు. అనంతరం ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక విమాన ప్రయాణికుడు విశ్వాస్ కుమార్‌ను ప్రధాని పరామర్శించారు. గాయపడిన ఇతర మెడికోలనూ మోడీ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట గుజరాత్ సిఎం భూపేంద్ర పటేల్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోంమంత్రి హర్ష్ సంఘవి తదితరులు ఉన్నారు.

ఇది ఊహించని పెను విషాదం: మోడీ

ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ ఇది ఊహించని పెను విషాదమని, బాధిత కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలనని విచారం వ్యక్తం చేశారు. ఆప్తులను కోల్పోయిన బాధ దీర్ఘకాలం ఉంటుందని, ఆ వేదనను మాటల్లోనే చెప్పలేమని అన్నారు. ఈ సమయంలో తన ఆలోచనంతా బాధిత కుటుంబాల గురించేనని తెలిపారు. అనంతరం ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. ఈ ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పార్టీ అభివృద్ధికి ఎంతో కష్టపడి పనిచేశారని మోడీ అన్నారు.

ఘటనాస్థలానికి ఎయిరిండియా ఎమ్‌డి

ఎయిరిండియా ఎమ్‌డి, సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్ ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి ఘటన జరిగిన తీరును పరిశీలించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బ్రిటిష్ హైకమిషన్ అధికారులు కూడా అహ్మదాబాద్‌కు చేరుకున్నారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

జాగిలాల సాయంతో మృతదేహాల కోసం శిథిలాల కింద గాలిస్తున్నారు. ప్రమాద సమయంలో విమానంలో మొత్తం 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. 169 మంది భారత పౌరులు కాగా.. 53మంది బ్రిటన్‌వాసులు, ఇతర విదేశీయులు ఉన్నారు. వీరిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారని ఎయిర్ ఇండియా ధ్రువీకరించింది. ఎమర్జెన్సీ విండో వద్ద ఉన్న ఒక్క ప్రయాణికుడు మాత్రం మృత్యుంజయుడిగా బయటపడ్డాడు. ఈ విమానం బిజె వైద్య కళాశాల మెడికోల వసతి గృహ సముదాయంపై కూలడంతో అందులోని పలువురు వైద్య విద్యార్థులు చనిపోయారు.

బ్లాక్ బాక్స్ లభ్యం

అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానానికి సంబంధించి అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్ లభ్యమైంది. భవన శిథిలాల నుంచి దీన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) వెల్లడించింది. ప్రమాద ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 40 మంది సిబ్బంది పౌరవిమానయాన శాఖ బృందాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇప్పటివరకు తెలియలేదు. అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని విశ్లేషిస్తే చివరి క్షణాల్లో ఏం జరిగింది, ప్రమాదానికి గల మిగతా 7లో

50 మందికిపైగా మెడికోలు మృతి? 7

కోర్ ఏరియాలో రూ.1052 కోట్లతో సదుపాయాలు

సిఆర్‌డిఏ సమావేశంలో నిర్ణయం

ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని పరిధిలో 1450 ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రభుత్వ భవనాల సముదాయం(కోర్ ఏరియా)లో సదుపాయాల కల్పనకు 1,052 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సిఆర్‌డిఎ సమావేశంలో ఈ పనులను వెంటనే టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణపై చర్చ జరిగింది. పెనుమాక రెవెన్యూ పరిధిలో రైతులు భూములు ఇచ్చినందున వెంటనే పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. దీనికోసం రూ.622 కోట్లు కేటాయించారు. సీతానగరం నుండి జాతీయ రహదారి 16లో మణిపాల్ ఆస్పత్రి వరకూ నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌ను విస్తరించాలని నిర్ణయించారు. గతంలో సుందరయ్యనగర్ వరకూ నిర్మించి అక్కడ జాతీయ రహదారిలో కలిసే చోట సాధారణ జంక్షన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు నేరుగా జాతీయ రహదారి వరకూ నిర్మించి అధునాతన పద్ధతిలో ట్రంపెట్ జంక్షన్ ఏర్పాటు చేయనున్నారు. దీనిపైనే ఎక్కువసేపు చర్చ జరిగినట్లు తెలిసింది. అలాగే ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్న కొండమరాజు పాలెంలోని ప్రభుత్వ కోర్ ఏరియాలో నిర్మాణాలకు ముందుగానే సదుపాయాల కల్పన మిగతా 7లో

నేతన్నలకు వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీల పెంపు

- చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వేలాదిమంది నేతన్నలకు లబ్ధిచేకూర్చే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచే కీలక నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సాంప్రదాయ చేనేత రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో 1,036 చేనేత సహకారం సంఘాలు ఉన్నాయని, వాటిలో 89 వేల మగ్గం నేత కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. ఆప్కోకు ఉత్పత్తులను సరఫరా చేసే ప్రాథమిక చేనేత సహకార సంఘాల కింద పని చేసే నేత కార్మికుల వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలు పెంపు వర్తిస్తుందన్నారు. బ్లీచింగ్ చార్జీలు బండిల్‌కు రూ. 148కి పెంచామని, డైయింగ్ చార్జీలు బండిల్‌కు రూ. 434కు, బెడ్ షీట్ నేత మజూరి రూ.100కు, టవల్ నేత మజూరి రూ.40కి పెంచినట్లు చెప్పారు. దీంతో ఒక్కో నేత కార్మికుడి ఆదాయం నెలకు రూ.3 పెరగనుందని తెలిపారు.

'తల్లికి వందనం'లో కోతలు వద్దు

సిపిఎం డిమాండు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా తల్లికి వందనం నగదును అర్హులైన విద్యార్థులందరి తల్లుల ఖాతాల్లో జమచేయాలని సిపిఎం డిమాండ్ చేసింది ఈ మేరకు ఆ పార్టీ కార్యదర్శి వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు అవసరమైతే నిబంధనలను సడలించాలని ఆయన సూచించారు. అడ్డగోలుగా పెట్టిన నిబంధనల కారనంగా దాదాపు తొమ్మిది లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో 2.5 లక్షలు, పట్టణాల్లో మూడు లక్షలులోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నిటికీ తల్లికి వందనం వర్తింపజేయాలని కోరారు. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ పథకాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతిలో చేరే వారికీ, ఇంటర్ పూర్తయిన వారికీ తల్లికి వందనం నగదు చెల్లించాలని కోరారు. స్కీమ్ వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. గత ప్రభుత్వం విధించిన షరతులను నాడు విమర్శించిన కూటమి నేతలు నేడు అంతకు మించిన షరతులు పెట్టి లబ్దిదారులతోపాటు నగదును కూడా తగ్గించడం సరికాదని వివరించారు. రూ.15 వేలు నేరుగా తల్లులకు చెల్లిస్తామని ఇప్పుడు రూ.2000 మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని చెప్పి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్న కుటుంబంలో విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయించడం హామీని ఉల్లంఘించడమే అవుతుందని తెలిపారు. ఇంతవరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎవరికీ ఇవ్వకుండానే ఆ పేరుతో తల్లికి వందనంపై కోత విధించడం అన్యాయమని, విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న వారి తల్లులకు కాకుండా నేరుగా స్కూళ్ల మేనేజ్‌మెంట ఖాతాలకు చెల్లించడం ప్రభుత్వ విద్యను దెబ్బతీయడమేనని విమర్శించారు. గ్రామవార్డు సచివాలయాల్లో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులందరికీ ఈ పథకం అమలు చేయాలని శ్రీనివాసరావు కోరారు.

కొమ్మినేనికి బెయిల్

- సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్ట్ అయిన సాక్షి టివి యాంకర్, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయన్ను విడుదల చేయాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. తన అరెస్టు, రిమాండ్‌ను సవాల్ చేస్తూ జర్నలిస్టు కెఎస్ఆర్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపిస్తూ ఆ వ్యాఖ్యలు పిటిషన్ దారుడు చేయలేదని, ఒక ప్యానెలిస్ట్ చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా జోక్యం చేసుకుని ఈ కేసు నావికా, సర్దేశాయ్ కేసు లాంటిదని అన్నారు. స్పందించిన న్యాయవాది సిద్ధార్థ్ దవే ఖచ్చితంగా అలాంటి కేసేనని ఏకీభవించారు. "వేరొకరు ఆ వ్యాఖ్య చేశారు. అలాంటప్పుడు పిటిషనర్ అరెస్టు ఎలా సాధ్యం?" అని రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గిని జస్టిస్ మన్మోహన్ ప్రశ్నించారు. దీనికి ముకుల్ రోహత్గిని జోక్యం చేసుకుని "ఆ వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తిని పిటిషనర్ రెచ్చగొట్టి ప్రోత్సహించారు. నవ్వారు" అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మరో సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూత్రా జోక్యం చేసుకుని ఈ ప్రకటన కేవలం పరువు నష్టం కలిగించేది మాత్రమే కాదని, లైంగిక దాడుల అంశంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని చెప్పారని వాదించారు. అయితే, ఈ వాదనలతో సుప్రీం ధర్మాసనం ఏకీభవించలేదు. పాత్రికేయ హక్కులు, వాక్ స్వాతంత్ర్యాలను కాపాడాల్సిఉందని చెబుతూ బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ షరతులను ట్రయల్ కోర్టు నిర్ణయిస్తుందని తెలిపింది.

ఊరిస్తున్న విజయం

- దక్షిణాఫ్రికా లక్ష్యం 282
- ప్రస్తుతం 213/2

8

పది వేల మందికి అందని వేట భృతి

- పలు రకాల కారణాలతో నిలిచిన నగదు జమ
- నేటి అర్ధరాత్రి నుంచి వేట నిషేధం ఎత్తివేత

2

గత ప్రభుత్వ నిబంధనలే

- రెండు రోజుల్లో అందరి ఖాతాల్లో నగదు జమ : 'తల్లికి వందనం'పై లోకేష్

3

రూ.వెయ్యి కోట్ల బీమా క్లెయిమ్..!

- ఎయిర్ ఇండియా ప్రతిపాదన

7

హోస్పేట్‌లో ఘోర ప్రమాదం

- ఓవర్‌టేక్ చేయబోయి లారీని ఢీకొన్న బస్సు
- ఉమ్మడి చిత్తూరుకు చెందిన ఐదుగురు మృతి
- మరో ప్రమాదంలో ముగ్గురు

ప్రమాదాన్ని గురైన ఎపిఎస్‌ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - వెదురుకుప్పం, బంగారుపాళ్యం

కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ఐదుగురు మరణించారు. చిత్తూరు నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు లారీని ఢీకొన్నడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. చిత్తూరు జిల్లా బంగారుపాల్యం మండలం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి తిమ్మోజపల్లి వద్ద పాదాచారులపైకి కారు దూసుకెళ్లడంతో ముగ్గురు మరణించారు. ఈ రెండు ప్రమాదాల్లో మొత్తం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు.

వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు చెందిన వ్యవసాయ కార్మికుడు కె. కేశవరెడ్డి అలియాస్ పెద్దబ్బరెడ్డి (45) తమ కుటుంబంతో కలిసి బెంగళూరులో ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం సోదరుడు జనార్ధన్‌రెడ్డి కుటుంబంతో కలిసి వారం రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నారు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో కేశవరెడ్డి తన భార్య శ్యామల, ముగ్గురు పిల్లలను ఇంటి వద్ద వదిలి తన తల్లి పాపమ్మ, సోదరుడు జనార్ధన్‌రెడ్డి, మరదలు గిరిజ, వారి ఇద్దరు పిల్లలు హిత్వీక్‌రెడ్డి (40రోజులు), జస్వంత్‌తో కలిసి గురువారం రాత్రి చిత్తూరు డిపోకు చెందిన బస్సులో బెంగళూరుకు ప్రయాణమయ్యారు. రాత్రి రెండు గంటల సమయంలో కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కేశవరెడ్డితో పాటు తమ్ముడి కుమారుడు హిత్వీక్‌రెడ్డి అక్కడికక్కడే మరణించారు. ఇదే బస్సులో ప్రయాణిస్తున్న శ్రీరంగరాజపురం మండలం పుల్లూరు పంచాయతీ కమ్మకంటిక గ్రామానికి చెందిన తులసి (21) మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన గంగాధర్ నెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన శారద (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం తిమ్మ రాజుపల్లి గ్రామంలో ఒంటెల హరిబాబు చిన్నకుమార్తె ప్రణతి (5) మరణించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎనిమిది మందితో పాటు పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

పాదాచారులను ఢీకొన్న కారు

చిత్తూరు జిల్లా బంగారుపాల్యం మండలంలోని తిమ్మోజిపల్లి గ్రామానికి చెందిన మండలం టిడిపి రైతు విభాగం మాజీ అధ్యక్షులు రాజేందర్ నాయుడు (54), అదే గ్రామానికి చెందిన వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి సాదరయ్య (45) సర్వీసు రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా అతివేగంగా దూసుకొచ్చిన కారు వారిని బలంగా ఢీకొట్టింటి. అనంతరం ఓ చెట్టును ఢీకొన్నది. రాజేంద్ర నాయుడు, కారు డ్రైవర్ సయ్యద్ దిలీప్ (54) అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన సాదరయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయండి

- గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచ రక్తదాతల దినోత్సవం జూన్ 14న జరుపుకుంటున్న నేపథ్యంలో అర్హులైన వారంతా స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్.అబ్దుల్ నజీర్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా రక్తదానం ప్రాముఖ్యతను గుర్తు చేసుకునేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ రక్తదాతల దినోత్సవం 2025ను 'రక్తాన్ని ఇవ్వండి, ఆశను ఇవ్వండి, కలిసి మనం ప్రాణాలను కాపాడుదాం' అనే ఇతివృత్తంతో జరుపుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువత అందరూ ఎపి రెడ్ క్రాస్ మొబైల్ యాప్‌తో రక్తదాతలుగా నమోదు చేసుకోవాలని, స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ రక్త కేంద్రాల్లో రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్న లక్షలాది మంది ప్రాణాలను కాపాడలని కోరారు.

23 నుంచి ఇంటింటికీ 'తొలి అడుగు'

- నెల రోజుల పాటు విజయయాత్ర
- టిడిపి నేతలతో చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన కార్యక్రమాలు, అమలు చేసిన పథకాలను ఈ నెల 23 నుంచి నెల రోజుల పాటు 'విజయయాత్ర' పేరుతో ఇంటింటికీ వివరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తెలుగుదేశం శ్రేణులకు పిలుపునిచ్చారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా టిడిపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయయాత్రలో లీడర్ నుంచి కేడర్ వరకూ ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను, చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని కూటమి కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తొలి ఏడాది చేసింది చెప్పడంతో పాటు దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ముఖ్య పథకాలను ఏడాదిలోపే అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నిబంధనలు కూడా మార్చకుండా తల్లికి వందనం పథకాన్ని మెరుగ్గా ఇస్తున్నామని చెప్పారు. పిల్లలందరికీ ఈ పథకాన్ని అమలు చేస్తున్నా బుద్ధి, జ్ఞానం లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదిన అన్నదాతా...సుఖీభవ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మహానాడు విజయవంతమైందని సేద తీరొద్దని, పార్టీ సంస్థాగత కమిటీలు పూర్తి చేయాలని చెప్పారు. పార్టీ కోసం కష్టపడేవారికి అవకాశం కల్పించాలని, అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని కమిటీల్లో స్థానం కల్పించాలని పేర్కొన్నారు. జులై నుంచి కార్యకర్తలు, నేతలకు నాయకత్వ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అధికారంలో లేనప్పుడు కార్యకర్తలు చాలా కష్టపడ్డారని తెలిపారు. ఎమ్మెల్యేలు కూడా ప్రతి రోజూ పార్టీ కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలని, ప్రజలతో నిత్యం కలుపుగోల తనంతో మెలగాలని సూచించారు.

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే..
ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

విశాఖ డెయిరీ కార్మికులను విధుల్లోకి తీసుకుని వారి సమస్యలను పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. గతంలో ఇచ్చిన హామీలను, ఒప్పందాలను నెరవేర్చాలని కోరిన 450 మంది కాంట్రాక్టు కార్మికులను విశాఖ డెయిరీ యాజమాన్యం విధుల్లోకి తీసుకోకపోవడంతో వారంతా శుక్రవారం డెయిరీ గేటు వద్ద, అక్కిరెడ్డిపాలెం వద్ద నిరసనలు చేపట్టారు. వారినుద్దేశించి నర్సింగరావు మాట్లాడుతూ.. డెయిరీ కార్మికుల సమస్యలపై కొద్ది రోజుల క్రితం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ దగ్గర సమావేశం జరిగిందని, అక్కడి నుంచి డెయిరీ యాజమాన్యానికి నోటీసు కూడా పంపించారని అన్నారు. సమ్మె చేసే హక్కు, సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని తెలిపారు. అంతమాత్రాన కార్మికుల విధులను ఆపడానికి వీల్లేదని, పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో సమస్యలపై కాంట్రాక్టు కార్మికులు పోరాటం చేసిన క్రమంలో పర్మినెంట్ చేస్తామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఒప్పందం కుదుర్చుకుని, ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు.

మహిళా కార్మికులు మాట్లాడుతూ తమను విధుల్లోకి తీసుకోకపోతే కదిలేది లేదని తేల్చి చెప్పారు. తాము ఏ తప్పు చేయకున్నా విధుల నుంచి నిలిపివేశారని మండిపడ్డారు. 15 నుంచి 20 సంవత్సరాలు సర్వీసు ఉన్న తమకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయన్నారు. తాము గతంలో పోరాడినప్పుడు పర్మినెంట్ చేస్తామని చెప్పి.. నేడు దొడ్డిదారిన వేరే వారిని నియమించాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.రాంబాబు, సిఐటియు నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, ఎ.లోకేష్, రమణ పాల్గొన్నారు.

పది వేల మందికి అందని వేట భృతి

- పలు రకాల కారణాలతో నిలిచిన నగదు జమ
- నేటి అర్ధరాత్రి నుంచి వేట నిషేధం ఎత్తివేత

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

చేపల వేటపై 61 రోజులపాటు ఉన్న నిషేధం శనివారం అర్ధరాత్రితో ముగుస్తున్నా ఇంకా 10,177 మంది మత్స్యకారులకు వేట భృతి సాయం అందలేదు. చేపల ఉత్పత్తికి ఇబ్బంది తలెత్తకుండా ప్రతి ఏడాది ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు వేటను నిషేధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కాలంలో మత్స్యకారులకు భృతి కింద కొంత సొమ్మును సాయంగా అందిస్తోంది. గతంలో వైసిపి ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద ఒక్కో మత్స్యకారునికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించేది. టిడిపి కూటమి ప్రభుత్వం దానిని రూ.20 వేలకు పెంచింది. మత్స్యకారులకు పెంచిన సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఈ ఏడాది ఏప్రిల్ 26న 'మత్స్యకార సేవలో' పథకం పేరుతో సాయం పంపిణీ చేశారు. వేట నిషేధం ముగుస్తున్నా అందులో వేలాది మంది మత్స్యకారులకు వారి ఖాతాల్లో సొమ్ములు జమ కాలేదు. బ్యాంకు ఖాతాలు సరిగా లేక, ఇప్పటికీ కొంత మంది వివరాలు సమగ్రంగా లేకపోవడంతో నగదు జమ నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

సాయానికి నోచని 10,177 మంది

మత్స్యకారులు

మత్స్యకారులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ 18న ఎన్యూమరేషన్ చేపట్టారు. ఏప్రిల్ 19 నుంచి 21వ తేదీ వరకు డేటా వెరిఫికేషన్ చేసి నమోదు చేశారు. 21న గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాలను ప్రదర్శించారు. 22, 23 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరించారు. జిల్లా స్థాయిలో 23వ తేదీన జిల్లా కలెక్టర్లు జాబితాలకు ఆమోదం తెలిపారు. ఆ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 1.45 లక్షల మందిని ఎన్యూమరేషన్‌లో గుర్తించారు. వాటిని సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ ద్వారా వడపోత పోశారు. పల్లం భూమి మూడు ఎకరాలు, మెట్ట పది ఎకరాలకు మించి ఉన్న వారిని, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నవారిని, కుటుంబ విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించి వాడిని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగించారు. కుటుంబంలో ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో పని చేసే ఉద్యోగులు ఉంటే వారిని అనర్హులుగా పక్కన పెట్టారు. కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తుంటే వారికీ పథకం వర్తింప చేయలేదు. చివరకు 1,29,178 మందిని అర్హులుగా గుర్తించి ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. అందులో ఇప్పటికీ 10,177 మందికిపైగా డబ్బులు జమ కాలేదు. వారిలో బ్యాంకు ఖాతాలు సరిగా లేక 4,786 మందికి, మత్స్యకారుల వివరాలు సరిగా నమోదు కాక మరో 5,391 మందికి డబ్బులు రాలేదు.

నేటి నుంచి చేపల వేట

మత్స్యకారులు శనివారం అర్ధరాత్రి తర్వాత చేపల వేటకు సిద్ధమవుతున్నారు. 61 రోజుల విరామం అనంతరం సముద్రంలో మళ్లీ మర పడవలు, సంప్రదాయ తెప్పలు కనిపించనున్నాయి. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో ప్రభుత్వం ప్రతి ఏటా చేపల వేటను నిషేధం విధించింది. అప్పటి నుంచి మత్స్యకారులు చేపల వేటకు దూరంగా ఉన్నారు. చేపల వేటపై ఉన్న నిషేధం ముగియనుండటంతో యదావిధిగా చేపల వేటకు వెళ్లేందుకు సమయాత్తమవుతున్నారు. అయితే, నైరుతి రుతుపవనాలు, ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో సముద్రంలో అలలు ఉధృతి అధికంగా ఉండటంతో ప్రస్తుతం కొద్ది రోజులు వేటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.

డిఎస్‌పి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

దళితులు నడిచిన రోడ్డుపై పసుపునీళ్లు

- మంగళగిరిలో బిజెపి నేత భార్య దాష్టీకం
- చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి ఆఫీసు ఎదుట దళితుల ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

దళితులు నడిచిన రోడ్డు మైలపడిందని పసుపు నీళ్ల చల్లడంతో పాటు వారిని కులం పేరుతూ దూషించిన సంఘటన మంగళగిరిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళగిరి పట్టణ బిజెపి అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు భార్య ప్రీతి తీరుపై దళిత మహిళలు, పలు సంఘాల నాయకులు శుక్రవారం నార్త్ సబ్‌డివిజన్ డిఎస్‌పి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు..మంగళగిరి కుప్పురావు కాలనీ 11వ లైన్ పద్మశాలీయ బజార్‌లో 25సంవత్సరాలుగా దళిత దంపతులు రాధా, వెంకటేశ్వరరావు నివశిస్తున్నారు. రాధా ఇంటి ఎదురుగా ఉన్న ప్రీతి గత కొంతకాలంగా రాధా, వారి మనవళ్లను కులం పేరుతో దూషిస్తూ వస్తున్నారు. చిన్న పిల్లలు ఆమె ఇంటి వైపు వెళ్లితే మైల పేరుతో రహదారిపై పసుపు నీళ్ల చల్లుతున్నారు. ప్రీతిపై కేసు నమోదు చేయాలని డిఎస్‌పి మురళీకృష్ణను ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు చందోలు విక్టర్‌పాల్, కలకొటి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంతేటి సాగర్ డిమాండ్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రీతిపై గత నెల 25న మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డిఎస్‌పి సిహెచ్ మురళీకృష్ణ విచారణ చేపట్టారు. విచారణ నత్తనడకన సాగడంతో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రీతిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేశారు.

మాకు కూడా 'తల్లికి వందనం'

- సిఎంకు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని తమకు కూడా వర్తింపచేయాలని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జెఎసి చైర్మన్ ఏవి నాగేశ్వరరావు, కో చైర్మన్ బి కాంతారావు శుక్రవారం లేఖ రాశారు. రూ.25వేల కంటే తక్కువ వేతనం పొందే ఉద్యోగులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేయకపోవడం వల్ల కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారని తెలిపారు. తక్కువ జీతాలతో ప్రభుత్వ శాఖల్లో నిబద్ధతతో సేవలందిస్తూ తమ కుటుంబాలను పోషించడానికి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ పరిస్థితుల్లో ఈ పథకం ద్వారా లభించే ఆర్థిక సహాయం తమ కుటుంబాలకు ఎంతో మద్దతుగా మారుతుందని కోరారు. ఇది చిరుద్యోగ కుటుంబాలకు కృతజ్ఞ తాభావాన్ని వ్యక్తపరిచే ఓ మానవీయ చర్యగా నిలుస్తుందని సూచించారు. తక్షణమే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు.

మున్సిపల్ కార్మికులకూ...

మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ కాకపోవడం కార్మికులను తీవ్ర అసంతృప్తికి గురి చేసిందని ఎపి మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో నిమిత్తం లేకుండా సంక్షేమ పథకాలన్నీ వర్తింప జేస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కార్మికులు చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్నందున వారికీ సంక్షేమ పథకాలు వర్తింప జేయాలన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులకు, స్కీం వర్కర్లందరికీ తల్లికి వందనంతోపాటు ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు, లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు. పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

16 నుంచి ఎల్‌సిఎ రకాల మిరప విత్తనాలు విక్రయాలు

- ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం, లాం ఫారంలో ఎల్‌సిఎ 625, ఎల్‌సిఎ 657, ఎల్‌సిఎ 643 మిరప రకాల పౌండేషన్ విత్తనాలు విక్రయించనున్నట్లు పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ సి.వెంకట రమణ తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఈ విత్తనాల విక్రయాలను చేపట్టనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్‌సిఎ 643 రకం పచ్చిమిర్చికి, ఎండు మిర్చికి అనువైన రకంగా తెలిపారు. ఆకర్షణీయమైన కాయలతో ఉంటుందని, ఈ రకం బెట్టను, జెమిని వైరస్‌ను, నల్లతామర పురుగు ఉధృతిని తట్టుకొంటుందన్నారు. ఎల్‌సిఎ 625 రకం ఎండు మిరపకు అనువైందిగా పేర్కొన్నారు. బలిష్టమైన కొమ్మలతో ఎత్తుగా పెరిగి కణుపులు దగ్గరగా ఉండి కాపు చిక్కగా ఉంటుందన్నారు. ప్రధాన పొలంలో నేరుగా ఎద పెట్టడానికి మిక్కిలి అనువైన రకమని చెప్పారు. కాయలు సన్నగా, మధ్యస్థ పొడవుతో ఉంటాయని తెలిపారు. అధిక ఘాటు వల్ల కాయకుళ్ల తెగులును కొంత తట్టుకుంటుందని, తాలు కాయలు తక్కువగా వస్తాయన్నారు. ఎల్‌సిఎ 657 రకం తొలకరి తరువాత నేరుగా ఎద పెట్టుకోవడానికి అనువైన, జెమిని వైరస్‌ను తట్టుకునే రకమని చెప్పారు. కాయలు పొడవుగా ఆకర్షణీయంగా ఉంటాయని తెలిపారు. అధిక బెట్టను తట్టుకుంటుందని పేర్కొన్నారు. లాం ఫామ్‌లో 16వ తేదీ నుంచి ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల లోపు విత్తనాలను లభ్యత ఉన్నంత వరకూ విక్రయించడం జరుగుతుందని తెలిపారు. కిలో విత్తనాలు రూ.1,200 మాత్రమేని వెల్లడించారు. రెండవ శనివారం, ప్రతి ఆదివారం సెలవు దినాలు కావడంతో విక్రయాలు ఉండవన్నారు. ఇతర వివరాలకు 99898 09554, 9440592982 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'తల్లికి వందనం'లో నిబంధనలు సరికాదు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుచోట్ల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

తల్లికి వందనం పథకంలో నిబంధనలు, రూ.రెండు వేలు కోత పెట్టడాన్ని నిరసిస్తూ పలు జిల్లాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం నిరసన ర్యాలీలు చేపట్టారు. తల్లికి వందనం పథకం విద్యార్థులందరికీ వర్తింపజేయాలని, నిబంధనల పేరుతో విద్యార్థుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం మానుకోవాలని నినదించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ వద్ద ధర్నాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమ్మఒడి పథకం సొమ్ములో కోత పెడితే ఆందోళనలు చేశారని, మరి ఇప్పుడు రూ.2 వేలు ఎందుకు కోత పెడుతున్నారని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన 'తల్లికి వందనం' నిధులను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇంట్లో ఒకరికి వస్తే మిగిలిన వారికి ఈ పథకం వర్తించదని చెప్పడం తగదన్నారు. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, రాజా పాల్గొన్నారు. వైఎస్ఆర్ జిల్లా అంబేద్కర్ సర్కిల్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

నరసింహ మాట్లాడుతూ.. టిడిపి కూటమి నాయకులు ఏడాది పాలనలో హామీలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలుకుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అధికారంలోకి రాకముందు ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున తల్లి ఖాతాల్లో నిధులు జమ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.

విజయనగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. తోట పాలెం నుంచి మయూరి జంక్షన్ మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇచ్చే రూ.15 వేలలో రూ.2 వేలు స్కూల్ నిర్వహణ ఖర్చులకు ఇవ్వాలని చెప్పడం సరికాదన్నారు. పూర్తిగా ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీకాకుళంలోని సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని హామీనిచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం, నేడు పాఠశాలల అభివృద్ధి పేరుతో రూ.రెండు వేలు కోత పెట్టడం దుర్మార్గమన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే జూలై 9 నుంచి నిరవధిక సమ్మె

- ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు జులై తొమ్మిదవ తేదిలోపే పరిష్కరించాలని, లేని పక్షంలో ఆ రోజు నుండి నిరవధిక సమ్మె చేయడానికి వెనుకాడమని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ షేషీలో అధికారులకు వర్కర్స్ యూనియన్ నాయకులు కె.ఉమామహేశ్వరరావు తదితరులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా నెలకు రూ.21 నుంచి 24,500 వేతనాన్ని గ్రామ పంచాయతీ కార్మికులకు చెల్లించాలని, బకాయిలు చెల్లించడంతోపాటు పిఎఫ్, ఇఎస్ఐ వంటి పథకాలను అమలు చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. టెండర్ల విషయంలో హై కోర్టు తీర్పును అమలు చేయాలని, ఎన్ఎంఆర్‌లకు గత తొమ్మిది నెలలుగా బకాయిలతో పాటు జీతాన్ని ప్రభుత్వమే చెల్లించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు 4 నుంచి 18 నెలల జీతాల బకాయిలు చెల్లించాలని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, పోలినాయుడు, పుల్లారావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, వి.శ్రీనివాసరావు ఉన్నారు.

ఎఫ్ఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎఫ్‌టిఇ పరిధిలోని వారందరినీ రెగ్యులర్ చేయాలని ఎపి గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ పేషీ అధికారులకు, యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు, ఇతర రాష్ట్ర నాయకులు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధి పథకంలో మేన్ డేస్ రద్దు చేయాలని, మండల పరిధిలోనే బదిలీలు నిర్వహించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరశిస్తూ, లేబర్ కోడ్‌ల రద్దుకు జూలై 9వ తేదీన నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసును అందజేశారు. నోటీసు అందజేసిన వారిలో యూనియన్ రాష్ట్ర నాయకులు టి.గణేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

కుప్పడం పట్టుచీరలకు జాతీయ అవార్డు

- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- 14న న్యూఢిల్లీలో ప్రదానోత్సవం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చీరాల కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డు లభించింది. ఒకే జిల్లా - ఒకే ఉత్పత్తి (ఒడిఒపి) కింద కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. జులై 14న న్యూఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరగనుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. చీరాల కుప్పడం పట్టు చీరకు ప్రకటించిన జాతీయ అవార్డును బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి అందుకోనున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ ఏడాది జనవరి తొమ్మిదిన కేంద్ర బృందం సభ్యులు ఇష్‌దీప్, డాక్టర్ దివ్యడింగ్రా... బాపట్ల జిల్లా చీరాలలో పర్యటించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కుప్పడం చీరల ప్రదర్శనను కేంద్ర బృందం సభ్యులు, జిల్లా కలెక్టర్ కలిసి పరిశీలించారు. ఆ సమయంలోనే చీరాలలో చేనేత వస్త్రాలైన కుప్పడం చీరల ఉత్పత్తులు, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై కేంద్ర బృందానికి కలెక్టర్ నివేదిక అందజేశారు. క్షుణ్ణంగా పరిశీలించిన కేంద్ర బృందం సభ్యులు చీరాల కుప్పడం చీరలకు ఒడిఒపి కింద గుర్తింపునిస్తూ జాతీయస్థాయి అవార్డును ప్రకటించింది. కుప్పడం చీరలు పూర్తిగా పట్టుతో తయారు చేస్తారు. చీర అంచులు జెరీ వర్క్‌తో తయారుచేస్తారు. కాంట్రాస్ట్ కలర్ టెంపుల్ బార్డర్ సృష్టించడానికి ఉపయోగించే ఇంటర్ లాకింగ్ టెక్నిక్ ద్వారా చీరకు రెండు వైపులా బార్డర్స్ వస్తాయి. విభిన్నమైన రంగుల్లో చీరలను తయారు చేయడం కుప్పడం ప్రత్యేకత. ఇంటర్ లాకింగ్ ప్రక్రియకు తెలుగు పేరు కుప్పడం కనుక ఈ పేరు వచ్చింది.

చీరలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

చట్టసవరణలతో పనిభారం

- వైఎస్ఆర్‌టియు నేత గౌతంరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్మిక చట్టాలను సవరించి పదిగంటల పనిదినాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మిక వ్యతిరేకి అని వైఎస్ఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పూనూరు గౌతంరెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చట్టాలను సవరించడం ద్వారా కార్మికులను తీవ్ర ఇబ్బందులు పాల్జేసే విధంగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో 50 నుండి 75 గంటలు ఓవర్‌టైం చేసుకునే విధానం ఉందని, దీన్ని 144 గంటలకు పెంచారని, దీనివల్ల కార్మికులపై పనిభారం పెరుగుతుందని అన్నారు. గతంలో ఐదుగంటలు పనిచేస్తే గంట విరామం ఉండేదని, ఇప్పుడు ఆరుగంటలు పనిచేయాలని చెబుతున్నారని తెలిపారు. షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్టులో సవరణలు తీసుకురావడం ద్వారా బాధ్యులైన అధికారులు కార్మికుల సదుపాయాలపై తనిఖీలు చేసే అధికారాన్ని కూడా తొలగించారని పేర్కొన్నారు. జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అనైతికమని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ముఖ్యమంత్రికి చెంపపెట్టని తెలిపారు. పత్రికా స్వేచ్ఛకు వేసిన సంకెళ్లను న్యాయవ్యవస్థ బద్దలు కొట్టిందని పేర్కొన్నారు. కొమ్మినేని అరెస్టు హేయం, అక్రమం అని దేశం మొత్తం అర్థం చేసుకుందని తెలిపారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం చెల్లదు : కల్యాణి

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం చెల్లదని, కొమ్మినేనిని అక్రమంగా అరెస్ట్ చేసిన వారందరూ క్షమాపణలు చెప్పాలని వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. న్యాయవ్యవస్థ ఉత్తర్వులతో సిగ్గు తెచ్చుకోవాలని, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఇకనైనా బుద్ధి మార్చుకోవాలని అన్నారు.

కూటమి కుట్రకు సుప్రీం చెక్ : మనోహర్‌రెడ్డి

కూటమి సర్కార్ అనుసరిస్తున్న కుట్రకు సుప్రీం కోర్టు చెక్ పెట్టిందని వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి అన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు కేసులో దుర్మార్గంగా వ్యవహరించారని, ఎక్కువ కాలం జైల్లో ఉంచేందుకు కుట్రపన్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వు పత్రికాస్వేచ్ఛను కాపాడేదిగా ఉందని వివరించారు.

రైతాంగానికి సబ్సిడీ విత్తనాలు

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతాంగానికి అవసరమైన సబ్సిడీ విత్తనాలు ఇచ్చి రుణ సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్రకమిటీ సమావేశం శుక్రవారం జరిగింది.ఆ సంఘం అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యతన జరిగిన ఈ సమావేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం విడుదల చేసిన ప్రకటనలో జూన్ 1వ తేదితో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ముందస్తు వర్షాలతో రాష్ట్రంలో రైతాంగం ముమ్మరంగా విత్తనాలు నాటే పనుల్లో నిమగ్నమయ్యారని తెలిపింది. ఆయా ప్రాంతాలను బట్టి రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీతో అందించాల్సిన ప్రభుత్వం ఖరీఫ్‌కు అవసరమైన సన్నాహాలు చెయలేదని రైతు సంఘం విమర్శించింది. విత్తనాల కోసం రైతాంగం ప్రైవేట్ విత్తన కంపెనీలు, వ్యాపారులపై ఆధారపడుతున్నారని తెలిపింది. దీంతో నాసిరకం విత్తనాలు అంటగడుతున్నారని తెలిపింది. తూటుకాడ, గుర్రపుడెక్కతో పూడుకుపోయిన కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతంలో పంట కాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరింది. పెట్టుబడికి అవసరమైన రుణసదుపాయం బ్యాంకుల నుంచి కల్పించాలని, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుంచి రైతులను కాపాడాలని కోరింది. బ్యాంకుల్లో రైతులకు వ్యవసాయానికి బంగారంపై ఇచ్చే రుణాలు, పంట రుణాలు రూ.3 నుంచి 5లక్షల వరకు వృద్ధిలేని రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని తెలిపింది. ఖరీఫ్ ప్రారంభంలో రైతులకు పెట్టుబడి ఖర్చులు అవసరం కనుక ఎన్నికల్లో హామీ ఇచ్చిన పెట్టుబడి సాయం రూ.20వేలు తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేసింది. సమావేశంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డి, ఉపాధ్యక్షులు కేశవరావు, మర్రాపు సూర్యనారాయణ, జొన్నా శివశంకర్, ఎ రాజశేఖర్, సహాయ కార్యదర్శులు పి హేమలత, వెంగయ్య, ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

19న ఢిల్లీలో జెండర్ బడ్జెట్‌పై సదస్సు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
జెండర్ బడ్జెట్‌పై ఈ నెల 19వ తేదీన ఢిల్లీలో ఒకరోజు సదస్సు నిర్వహించాలని కేంద్ర మహిళాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఈ సదస్సులో పాల్గొనేందుకు రాష్ట్ర ఆర్థికశాఖకు చెందిన ఇద్దరు మహిళా అధికారులు ఢిల్లీకి వెళ్లనున్నారు. 2005-06 ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్ర బడ్జెట్‌లో జెండర్ బడ్జెట్‌కు కూడా ప్రత్యేక పద్దును నిర్వహిస్తున్నారు. తాజాగా 2047 వికసిత్ భారత్ ప్రణాళికలో భాగంగా మహిళాభివృద్ధికి పెద్దపీట వేసేందుకుగాను జెండర్ బడ్జెట్‌పై అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని రంగాల్లో మహిళలు సమాన స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో, అభివృద్ధి, పాలనలో కీలక పాత్ర పోషించాలన్న ధ్యేయంతో ఈ సదస్సును నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రం నుంచి అదనపు కార్యదర్శి ఎస్.శాంతికుమారి, సహాయ కార్యదర్శి డి.ప్రశాంతిలను ఈ సదస్సుకు పంపించాలని రాష్ట్ర ఆర్థికశాఖ నిర్ణయించింది.

భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)
పోలీస్ స్టేషన్‌లో తనపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోలేదని భార్యను హత్యచేసి ఆపై తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన విశాఖ ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డి కంచరపాలెంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నందిగాం గోపీనాథ్ (42), ఆయన భార్య వెంకటలక్ష్మి (39), ఇద్దరు పిల్లలతో రెడ్డి కంచరపాలెంలో నివసిస్తున్నారు. గోపీనాథ్ పెయింటింగ్ పనులు చేస్తూ, వచ్చిన ఆదాయాన్ని కుటుంబ అవసరాలకు ఇవ్వకుండా చెడు అలవాట్లకు ఖర్చు చేస్తుండేవారు. డబ్బుల విషయంలో భార్య భర్తలు తరుచు గొడవ పడేవారు.

గోపినాథ్‌లో ఎంతకూ మార్పురాకపోవడంతో చివరకు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారు. తన భర్త వేధిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో తనపై పోలీస్ స్టేషన్‌లో పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని గురువారం రాత్రి భార్యపై గోపీనాథ్ ఒత్తిడి తెచ్చారు. అందుకు ఆమె ఒప్పుకోలేదు. దీంతో గోపీనాథ్ తీవ్ర ఆగ్రహానికి గురై అర్ధరాత్రి సుమారు 2:30 గంటల సమయంలో డంబుల్‌తో ఆమె తలపై బాదారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. తరువాత ఫ్యాన్‌కు ఉరేసుకుని గోపినాథ్ ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గత ప్రభుత్వ నిబంధనలే

రెండు రోజుల్లో అందరి ఖాతాల్లో నగదు జమ : 'తల్లికి వందనం'పై లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
తల్లికి వందనం పథకానికి గత ప్రభుత్వం విధించిన నిబంధనలనే తమ ప్రభుత్వం కూడా అమలు చేస్తోందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద 67,27,000 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయడానికి రూ.8745కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆ మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోందని, శనివారం లోపు ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. అర్హులైన వారికి జమకాకపోతే జూన్ 26వ తేదీ వరకు మనమిత్ర వాట్సాప్ ద్వారా గానీ గ్రామ, వార్డు సచివాలయ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. మిగిలిన వారికి జులై 5వ తేదిన జమఅవుతాయని పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారుల ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడంతో నిధులు తిరిగి వచ్చాయని, వెంటనే లబ్ధిదారులు యాక్టివ్ చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను తొలిరోజే 80శాతం అందించామని, మిగిలిన వాటిని ఈ నెల 20వ తేదీలోపు అందజేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అమ్మఒడి కార్యక్రమం కింద ఏడాదికి 42 లక్షల మందికి రూ.5540 కోట్లే ఇచ్చారని, తమ ప్రభుత్వం 67.27లక్షల మందికి అమలు చేస్తోందన్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం తీసుకుంటున్న రూ.2వేలను తన జేబుల్లోకి వెళ్తున్నాయని వైసిపి నాయకులు చేస్తున్న విమర్శలపై న్యాయబద్ధంగా పోరాడతానని వెల్లడించారు.

9,600 మోడల్ ప్రైమరీ పాఠశాలలు
ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా రాష్ట్రంలో 9,600 ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అప్పుడే లెర్నింగ్ అవుట్ కమ్స్ బాగా వస్తాయని తెలిపారు. బడులు తెరిచిన రోజే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది సాధించలేకపోయామని చెప్పారు. ఈ నెల 16వ తేదిలోపు ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. తాను ఆన్‌లైన్ మెకానిజం పెట్టాలని అనుకున్నానని, ఉపాధ్యాయులు మాన్యువల్ పెట్టాలని కోరారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులను సరైన దారిలో పెట్టాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

ఉన్నత విద్య వ్యవస్థను కూడా మెరుగుపరుస్తామని తెలిపారు. మరో మూడు నెలల్లో మిగిలిన విశ్వవిద్యలయాలకు వైస్ ఛాన్సలర్లను నియమాక ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు.

గిరిజన వర్సిటీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ
- భవన నిర్మాణ పనులు పరిశీలన

కుంటినవలస వద్ద నిర్మితమవుతున్న సిటియు భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు

ప్రజాశక్తి -విజయనగరం టౌన్, పార్వతీపురం
కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ (సిటియు) నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలస వద్ద నిర్మితమవుతున్న సిటియు భవన నిర్మాణాలను అభివృద్ధి వేదిక నాయకులు శుక్రవారం పరిశీలించారు. అనంతరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ టివి కట్టమణిని కలిసి పలు సమస్యలపై చర్చించారు.

ఈ సందర్భంగా అజశర్మ, శ్రీనివాస మాట్లాడుతూ.. 2019లో ఏర్పడిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణం ఇప్పటికీ పూర్తికాకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, వాటిని వేగవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంపై చిన్న చూపు చూడడం తగదన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఎంతగానో తోడ్పడుతుందని, వెంటనే వర్సిటీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, ఏరియా ఆస్పత్రులు, కురుపాం సిహెచ్‌సి, పార్వతీపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను అజశర్మ పరిశీలించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ నాగభూషణరావుతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 150 పడకలకు అప్‌గ్రేడ్ అయిన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఆంకాలజీకి సంబంధించిన వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతను కలిసి వినతిపత్రం అందజేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్
అప్పులబాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పాపంపల్లి గ్రామానికి చెందిన గొల్ల జట్టింగప్ప (50)కు 1.50 ఎకరాల పొలం ఉంది. ఇందులో వర్షాధార పంటలు సాగు చేస్తున్నారు. పంటల సాగు నిమిత్తం దాదాపు రూ.7 లక్షల వరకు అప్పులు చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గత నాలుగేళ్లగా పంటలు చేతికందలేదు. దీంతో అప్పులు తీర్చడం కష్టమైంది. అప్పులు తీరే మార్గం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం ఊరి చివరన ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలి

- ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, ఒప్పంద జిఒలను వెంటనే అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడలోని సిఐటియు కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం హామీలు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఉత్తర్వులు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. కాబట్టి అప్పటి వరకూ ఆశాల ఉద్యోగ విరమణలను నిలపాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రాట్యుటీ, మెటర్నిటీ లీవ్, సెలవులు, మట్టిఖర్చులు తదితర అంశాలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయకపోవడం ఆశాల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కుల్ని కాలరాస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మద్దతుగా మహిళలకు నైట్ షిఫ్టులు, పని గంటల పెంపు వంటి నిర్ణయాలతో చట్టాలను సవరిస్తూ.. కార్మికులకు ద్రోహం చేస్తుందని తెలిపారు. ఈ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని రాష్ట్రాన్ని హెచ్చరించారు. ఎపిలో డిసెంబరులో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయడానికి ఆశా వర్కర్స్ యూనియన్ సంపూర్ణంగా సహకరించాలని రాష్ట్ర కమిటీ తీర్మానించింది. ఈ సమావేశానికి పర్చూరు ధనశ్రీ అధ్యక్షత వహించగా, యూనియన్ రాష్ట్ర నాయకులు కమల, జ్యోతి, అన్నపూర్ణ, పద్మ, సుభాషిణి, శివకుమారి, నాగమణి, కల్పన వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగుపడాలి

- వర్క్‌షాపులో ఛైర్మన్ పట్టాభిరామ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో రాష్ట్రం అట్టడుగున ర్యాంకుల్లో ఉందని, దానిని మెరుగుపరుచుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై శుక్రవారం విజయవాడలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఆడిటోరియంలో వర్క్‌షాపు జరిగింది. దీనికి అన్ని జిల్లాల జెడ్‌పి సిఇఓలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, డిపిఓ, డ్రింకింగ్ వాటర్ సరఫరా, శానిటేషన్ కమిటీ కన్సల్టెంట్లు హాజరయారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకెళ్లేలా కార్యచరణ ఉండాలని సూచించారు.

గత ప్రభుత్వం శానిటేషన్‌పై దృష్టి సారించలేదని, దీనివల్ల సర్వేక్షణ్ ర్యాంకింగ్స్‌లో 12వ స్థానానికి దిగజారామని వివరించారు. జిల్లాల వారీగా వచ్చిన ర్యాంకుల్లో మొదటి 50 ర్యాంకుల్లో రాష్ట్రంలోని ఒక్క జిల్లా కూడా లేదని తెలిపారు. రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ పాలసీ తీసుకువస్తున్నామని, రిసైక్లింగ్ పార్కు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ సిఇ హరిరామ్ నాయక్, అడిషనల్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్, ఈడి ఊర్మిళ, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బెలూం గుహలకు మరింత ప్రాచుర్యం

- పర్యాటక శాఖమంత్రి దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: అంతర్జాతీయ స్థాయిలో బెలూం గుహలకు మరింత ప్రాచుర్యం కల్పిస్తామని పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బెలుం గుహలకు భౌగోళిక వారసత్వ జాబితాలో చోటు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భౌగోళిక వారసత్వ ప్రదేశంగా వచ్చిన గుర్తింపుతో మరింత అభివృద్ధికి నోచుకునేందుకు అవకాశముందని తెలిపారు. ప్రపంచంలో రెండోది, దేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా బెలూం గుహలు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందాయని పేర్కొన్నారు.

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి

కరెంట్ అఫైర్స్

భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

- భారత 76వ గణతంత్ర దినోత్సవ (రిపబ్లిక్ డే) వేడుకలను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2025 జనవరి 26న ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లు జాతీయ జెండా ఎగరేసి గౌరవ వందనం స్వీకరించారు.
- **"స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్:** వికాస్ (Swarnim Bharat, Virasat aur Vikas) అనే థీమ్‌తో 2025 ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు.
- దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ ప్రధాన వేడుకకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
- గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్ ముందు ప్రధాని నరేంద్ర మోడీ ఇండియా గేట్ వద్ద జాతీయ యుద్ధ స్మారక చిహ్నం (నేషనల్ వార్ మెమోరియల్) వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమర జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం కర్తవ్యపథ్‌లో గణతంత్ర వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల నుంచి ఆమె గౌరవవందనం స్వీకరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గౌరవ వందనం స్వీకరించడంతో గణతంత్ర దినోత్సవ కవాతు(పరేడ్) ప్రారంభమైంది. పరేడ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో త్రివిధ దళాల వందనం స్వీకరించారు. ఈ వేడుకల్ని వీక్షించేందుకు దాదాపు 10వేల మంది ప్రత్యేక అతిథులు హాజరయ్యారు.
- కర్తవ్యపథ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వికసిత్ భారత్, నారీ శక్తి అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దేశ చరిత్రలో తొలిసారిగా 100 మంది మహిళలు శంఖం, నాదస్వరం వంటి సంప్రదాయ సంగీత వాయిద్యాలను వాయిస్తూ కర్తవ్యపథ్ నిర్వహిస్తున్న పరేడ్‌ను ప్రారంభించారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో నారీ శక్తికి ప్రాతినిధ్యం వహిస్తూ మహిళా అధికారులు లెఫ్టినెంట్ కర్నల్ రవీందర్‌జీత్ రంధావా, లెఫ్టినెంట్

కమాండర్ మణి అగర్వాల్, ఫ్లైట్ లెఫ్టినెంట్ రుచి సాహ్, కెప్టెన్ సంధ్యా మహ్లే దీనిలో పాల్గొన్నారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO) నిర్వహించిన కవాతుకు మహిళా శాస్త్రవేత్త సునీతా జైనా నాయకత్వం వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఐశ్వర్య జాయ్ నేతృత్వంలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (CRPF)కు చెందిన 148 మంది సభ్యుల మహిళా బృందం, డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆదిత్య నేతృత్వంలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ బృందం పరేడ్‌లో పాల్గొన్నాయి. 352 మంది సభ్యుల ఇండోనేషియా బ్యాండ్ బృందం కవాతులో పాల్గొంది.

- అనంతరం ట్యాంక్ టీ-90 (భీష్మ), బీఎంపీ-2 శరత్‌తోపాటు నాగ్, బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థలు, పినాక రాకెట్ వ్యవస్థ, అగ్నిబాణ్ మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు, ఆకాశ్ వెపన్ సిస్టమ్, చేతక్, బజరంగ్, మౌంటెడ్ పదాతిదళ మోర్టార్ సిస్టమ్ (ఐరావత్)తో సహా పలు ఆయుధాలను ప్రదర్శించారు. ఆర్మీకి చెందిన యుద్ధ నిఘా వ్యవస్థ 'సంజయ్' డీఆర్డీవో 'ప్రళయ్' వ్యూహాత్మక క్షిపణి తొలిసారిగా ప్రదర్శించారు. ప్రదర్శనలో ఇతర సైనిక శకటాల్లో టీ-90 'భీష్మ' ట్యాంకులు, శరత్ పదాతిదళం వాహనాలు, నాగ్ క్షిపణి వ్యవస్థ, మౌంటెడ్ పదాతిదళ మోర్టార్ సిస్టమ్ (ఐరావత్) ఉన్నాయి. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO) 'రక్షా కవచ్' థీమ్‌ను ప్రదర్శించింది.
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కర్తవ్య పథ్‌లో జరిగిన పరేడ్‌లో 'స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్' అనే ఇతివృత్తంతో శకటాలను రూపొందించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కర్తవ్య పథ్‌లో జరిగిన పరేడ్‌లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి 16 శకటాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, వివిధ సంస్థలకు చెందిన 15 శకటాలతో మొత్తం 31 శకటాలు కర్తవ్య పథ్ వేదికగా ప్రదర్శించారు. త్రివిధ దళాలు సంయుక్తంగా 'సశక్త్ ఔర్ సురక్షిత్ భారత్' అనే థీమ్‌తో శకటాన్ని ప్రదర్శించాయి. త్రివిధ దళాలు సంయుక్తంగా ఒక శకటాన్ని తీసుకురావడం ఈసారి ప్రత్యేకత.

వక్ఫ్ సవరణ చట్టం-2025

పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొంది, రాష్ట్రపతి ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లు (యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫీషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ (ఉమీద్-UMEED) చట్ట రూపం దాల్చింది. వక్ఫ్ చట్టం ఏప్రిల్ 8 నుంచి 'అమల్లోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. వక్ఫ్ (సవరణ) చట్టం-2025లోని సెక్షన్ 1లో ఉన్న సబ్ సెక్షన్ 2 ద్వారా దఖలు పడిన అధికారాలను అనుసరించి 2025 ఏప్రిల్ 8వ తేదీని చట్టంలోని నిబంధనలు అమల్లోకి వచ్చే తేదీగా ప్రకటిస్తున్నాం అని ఆ నోటిఫికేషన్‌లో ఉంది.

వక్ఫ్ సవరణ బిల్లు-పరిణామ క్రమం

- వక్ఫ్ పాలక వర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసే విధంగా వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. వక్ఫ్ బోర్డులో మహిళలు, ఓబీసీ ముస్లింలు, షియా, బోహ్రా తదితర ముస్లింలకు చోటు కల్పిస్తూ చట్ట సవరణ చేసింది.
- 1995 నాటి వక్ఫ్ చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ తీర్చిదిద్దిన కొత్త బిల్లుకు ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో జరిగిన మంత్రివర్గ సమావేశం 2024 ఆగస్టు 2న ఆమోదం తెలిపింది.
- అనంతరం కేంద్ర ప్రభుత్వం 'వక్ఫ్ (సవరణ) బిల్లు-2024'ను 2024 ఆగస్టు 8న లోక్ సభలో ప్రవేశపెట్టింది. అయితే ఈ బిల్లును. ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. విపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ-JPC) పరిశీలనకు పంపారు.
- వక్ఫ్ సవరణ బిల్లు-2024పై అధ్యయనం కోసం 31 మంది సభ్యులతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా బీజేపీ సీనియర్ ఎంపీ జగదంబికా పాల్ నియమితులయ్యారు. ఈ కమిటీలో 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ ఎంపీలకు చోటు కల్పించారు. అందులో 12 మంది బీజేపీ, నలుగురు కాంగ్రెస్ సభ్యులున్నారు. ఉభయ సభల నుంచి 8 మంది మైనారిటీ సభ్యులకు అవకాశం ఇచ్చారు.
- వక్ఫ్ సవరణ బిల్లును అధ్యయనం చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (UPC) 2025 జనవరి 29న 15-11 మెజారిటీ ఓటుతో ముసాయిదా చట్టానికి సబంధించిన నివేదికను ఆమోదించింది. జనవరి 30న తమ నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేసింది. అనంతరం ప్రభుత్వం ఏప్రిల్‌లో వక్ఫ్ (సవరణ) బిల్లు 2025గా పార్లమెంటులో తిరిగి ప్రవేశపెట్టింది.
- లోక్‌సభ వక్ఫ్ (సవరణ) బిల్లు 2025ను ఏప్రిల్ 2, 2025న ఆమోదించింది. 288 మంది లోక్‌సభ సభ్యులు దీనికి మద్దతు ఇవ్వగా, 232 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు.
- ఏప్రిల్ 4, 2025న రాజ్యసభ కూడా ఈ బిల్లును ఆమోదించింది. 128 మంది సభ్యులు అనుకూలంగా, 95 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు.
- వక్ఫ్ బిల్లు పేరును యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫీషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ బిల్లుగా (ఉమీద్ -UMEEDI)"గా ప్రభుత్వం పేర్కొంది. దీంతో పాటు 'ముసల్మాన్' వక్ఫ్ (ఉపసంహరణ) బిల్లు'ను కూడా పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించాయి.
- పార్లమెంటు ఆమోదం పొందిన వక్ఫ్ (సవరణ) బిల్లు-2025కు, ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహరణ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2025 ఏప్రిల్ 5న ఆమోదం తెలిపారు.
- వక్ఫ్ చట్టం 2025 ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి వచ్చింది. వక్ఫ్ బిల్లులోని కీలక అంశాలు
- **ముస్లిమేతరులకు సభ్యత్వం:** కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను చేర్చాలని సవరణ బిల్లు సూచిస్తోంది. తద్వారా నిర్ణయ ప్రక్రియ విస్తృతంగా, పారదర్శకంగా ఉంటుంది.
- **వక్ఫ్ బై యూజ్ తొలగింపు:** దీని ప్రకారం దీర్ఘకాలంగా ఉపయోగంలో ఉన్న ఆస్తులను వక్ఫ్‌గా గుర్తించడం ఇకపై సాధ్యం కాదు. తద్వారా ఆస్తి తగాదాలకు పరిష్కారం లభిస్తుంది.

సర్వే అధికార పరిధి మార్పు: వక్ఫ్ ఆస్తుల సర్వే బాధ్యతను సర్వే కమిషనర్ నుంచి జిల్లా కలెక్టర్ లేదా నియమిత అధికారికి మార్చడం ద్వారా సమర్థవంతమైన సర్వే ప్రక్రియ ఏర్పడుతుంది.

ప్రత్యేక వక్ఫ్ బోర్డుల ఏర్పాటు: బోహ్రా, అగఖాని ముస్లిం సమాజాలకు ప్రత్యేక వక్ఫ్ బోర్డులు ఏర్పాటు చేయడానికి అవకాశం.

డిజిటల్ నమోదు విధానం: వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం కేంద్రీకృత డిజిటల్ పోర్టల్ అందుబాటులోకి రానుంది, వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ఇది పారదర్శకతను పెంచుతుంది.

మ్యూటేషన్ ప్రక్రియలో మార్పు: వక్ఫ్ ఆస్తులను రికార్డులో నమోదు చేసే ముందు సంబంధిత వ్యక్తులకు తెలియజేసే విధానాన్ని అమలు చేయనున్నారు.

వక్ఫ్ ట్రిబ్యునల్స్ పునర్వ్యవస్థీకరణ: ట్రిబ్యునల్లో జిల్లాస్థాయి కోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర ప్రభుత్వంలో సంయుక్త కార్యదర్శి హోదాలో ఉన్న అధికారి సభ్యులుగా ఉండనున్నారు.

అప్పీలుకు అవకాశం: వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పుపై 90 రోజుల్లో హైకోర్టులో అప్పీలు దాఖలు చేసే అవకాశం ఉంటుంది.

చట్టం పేరు మార్పు: 'వక్ఫ్ చట్టం, 1995 ఇక మీద 'యునిఫైడ్' వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్మెంట్, ఎఫీషియెన్సీ అండ్ డెవలప్మెంట్ చట్టం, 1995గా మారనుంది.

వక్ఫ్ ఆస్తుల అభివృద్ధిపై దృష్టి: విద్యాసంస్థలు, మార్కెట్లు, గృహనిర్మాణ ప్రాజెక్టులను నిర్మించడం వంటి అభివృద్ధి ప్రయోజనాల కోసం వక్ఫ్ భూములను ఉపయోగించడానికి వక్ఫ్‌బోర్డులను అనుమతించడం నూతన బిల్లు లక్ష్యం.

వక్ఫ్ చట్టం నేపథ్యం

ఇస్లాం సంప్రదాయంలో ముస్లిం సమాజ ప్రయోజనం కోసం చేసే దానం లేదా విరాళాన్ని 'వక్ఫ్' అంటారు. వక్ఫ్ ఆస్తులన్నీ అల్లాకు చెందుతాయని భావిస్తారు. కనుక వాటి అమ్మకం, ఇతర ప్రయోజనాలకు వాడకం పూర్తిగా నిషిద్ధం. మసీదులు, మదర్సాలు, శ్మశానవాటికలు, అనాథాశ్రమాల నిర్మాణ, నిర్వహణ తదితరాల నిమిత్తం ఉపయోగించాలి. భారత్‌లో వక్ఫ్ సంప్రదాయం 12వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తానుల హయాంలో మొదలైంది. స్వాతంత్ర్యానంతరం దేశంలో మొదటిసారిగా వక్ఫ్ చట్టాన్ని 1954లో తీసుకొచ్చారు. అనంతరం దానికి మరిన్ని అధికారాలు కల్పిస్తూ 1996లో చట్టాన్ని సవరించారు. 1996లో తెచ్చిన కొత్త చట్టం ద్వారా వక్ఫ్‌బోర్డులకు మరిన్ని అధికారాలు దఖలు పడ్డాయి. వాటిన అపరిమితంగా పెంచుతూ యూపీఏ ప్రభుత్వం 2013లో మరిన్ని సవరణలు చేసింది. ఇందులో పేర్కొన్న నిబంధనల ప్రకారం, ఏ కోర్టుల్లోనూ సవాల్ చేయలేని విధంగా, ఎవరి ఆస్తులనైనా స్వాధీనం చేసుకునే ప్రత్యేక అధికారాలు బోర్డులకు కల్పించారు. దాతలు ఇచ్చిన ఈ భూముల్ని అమ్మే అధికారం వక్ఫ్ బోర్డుకు సైతం లేదు. అయితే రాష్ట్ర వక్ఫ్ బోర్డులకు విస్తృతమైన హక్కులున్నాయి. ఇలాంటి ఆస్తులను సర్వే చేయడానికి ఆలస్యమవుతోందని ప్రభుత్వం గతంలోనే గుర్తించింది. ఆస్తుల దుర్వినియోగాన్ని నివారించడానికి, వక్ఫ్ ఆస్తులను పర్యవేక్షించడంలో జిల్లా మేజిస్ట్రేట్లను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా పలు మార్పులు చేయాలని నిర్ణయించింది.

18వ ప్రవాసీ భారతీయ దివస్-2025

18వ ప్రవాసీ భారతీయ దివస్ (PBD)- 2025 సదస్సు జనవరి 8 నుంచి 10వ తేదీ వరకు ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని జనతా మైదానంలో జరిగింది.

2025 ఏడాది ప్రవాస భారతీయ దినోత్సవం యొక్క థీమ్ - Diaspora-s Contribution to a Viksit Bharat.

ప్రవాసీ భారతీయ దివస్ సదస్సులో రెండో రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయ సదస్సు వేదికపై నుంచి ప్రవాస భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలు'ను ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరిన ఈ రైలు దేశంలోని 17 పుణ్యక్షేత్రాల మీదుగా ప్రయాణం సాగిస్తుంది. 150 మంది ప్రవాసులు దీనిలో ఉచితంగా పర్యటిస్తారు, ప్రవాస భారతీయ సదస్సులో ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టిన్ కర్లా కంగా ముఖ్య అతిథిగా వర్చువల్‌గా పాల్గొన్నారు.

ప్రవాస భారతీయ దివస్ సందర్భంగా 'హరిత అనుసంధానత:
సుస్థిరాభివృద్ధికి ప్రవాసుల చేయూత' అనే అంశంపై నిర్వహించిన ప్లీనరీ సదస్సులో రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ ప్రసంగించారు.

- ప్రవాస భారతీయ సదస్సు ముగింపు సభలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొని ప్రసంగించారు..
- క్రిస్టిన్‌కర్లా కంగాకు 'ప్రవాసీ భారతీయ సమ్మాన్' అవార్డు-2025 : ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాధ్యక్షురాలు క్రిస్టిన్ కర్లా కంగాలుకు భారత ప్రభుత్వం 'ప్రవాసీ భారతీయ సమ్మాన్' అవార్డు ప్రకటించింది.

ప్రవాసీ భారతీయ దివస్

మహాత్మాగాంధీ వందేళ్ల కిందట 1916 జనవరి 9న దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం 2003 నుంచి ఏటా అదే రోజున ప్రవాసీ భారతీయ దివస్'ను నిర్వహిస్తోంది. నాటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జనవరి 9వ తేదీని 'ప్రవాసీ భారతీయ దివస్'గా ప్రకటించారు.

సంపాదకీయం

విధానం మారాలి

యాభై రోజుల వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. షరా మామూలే అన్నట్లు సమస్యలూ ముసురుకున్నాయి. విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి విద్య అతి ప్రధానమైనది. భావి పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దేవి బడులే. ఈ విషయాలు ఏలికలకు తెలియనివేమీ కావు. వారు నిత్యం వల్లించేవే. ఎంచుకున్న విధానాలే మాటలకు చేతలకు పొంతన కుదర్చనీయడంలేదు. ప్రభుత్వరంగంలో వికసించాల్సిన విద్య ఎప్పుడైతే కార్పొరేట్, ప్రైవేటు ఆధిపత్యం కిందికి నెట్టబడిందో అప్పటి నుంచి విద్య అనేది వ్యాపార సరుకుగా మారిపోయింది. తాహతును బట్టి విజ్ఞానం! ఈ విధానం క్రమంగా ప్రభుత్వ విద్య నిర్వీర్యానికి దారి తీసింది. ఇంకా కొంత వరకు ప్రాథమిక, హైస్కూలు విద్య ప్రభుత్వరంగంలో ఉండగా, ఇంటర్, ఉన్నత, వృత్తి విద్య కార్పొరేట్ల గుప్పెట్లోకి వెళ్లిపోయింది. కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రతిపాదించిన నూతన విద్యా విధానం అటు కార్పొరేటీకరణ ఇటు కాషాయీకరణ మయం. మారు మాట్లాడకుండా కేంద్రంతో సై అంటున్నాయి ఎన్‌డిఎ, వాటి ప్రభావంలో ఉన్న పార్టీ ప్రభుత్వాలు. ఆ కొనసాగింపే విద్యకు బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు, కార్పొరేట్ అనుకూల విధానాలు.

రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలపై హైప్ ఇస్తోంది. తొమ్మిది రకాల బడులని, విద్యార్థులకు మోత బరువు తగ్గింపని, ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' అని ఈ ఏడాది నుంచి మార్పులు చేసింది. ఇప్పటికే ఏకోపాధ్యాయ స్కూళ్లు వేలల్లో ఉన్నాయి. విద్యార్థులు లేక టీచర్ పోస్టులు మిగిలిపోతున్నాయి. కొత్త కసరత్తు తర్వాత పరిస్థితేంటో తెలీదు. గత ప్రభుత్వ హయాంలో విలీనం పేరిట 4 వేల బడులు మూతబడ్డాయి. కూటమి ప్రభుత్వం వాటిని తెరిపించలేదు. ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా ప్రైవేటు, కార్పొరేట్‌లో చేరికలు పెరుగుతున్నాయి. ఉచిత పుస్తకాలు, యూనిఫాంతో కిట్లు, మధ్యాహ్న భోజనం అన్నా ప్రభుత్వ బడులు అంతగా ఆకర్షించడంలేదు. మెగా డిఎస్‌సిలో 16 వేల పైచిలుకు టీచర్ పోస్టులు నింపేందుకు ఏర్పాట్లు చేశారు. రేషనలైజేషన్ ప్రకారం 25 వేల ఖాళీలు నింపాలన్న డిమాండ్ ఉంది. విద్యార్థుల డ్రాపవుట్స్ తీవ్రంగానే ఉంది. నిరుడు 2.10 లక్షల డ్రాపవుట్స్‌ను గుర్తించామని ప్రభుత్వమే తెలిపింది. హైస్కూలు స్థాయిలో డ్రాపవుట్స్ విషయంలో ఎ.పి. దేశంలో మొదటి రెండు మూడు స్థానాల్లో ఉంటోంది. గతంలో 'అమ్మఒడి' ఇప్పుడు 'తల్లికి వందనం' అంటున్నా డ్రాపవుట్స్ సమస్య అలానే ఉంటోంది. తల్లికి వందనం కింద ఫస్ట్ నుంచి ఇంటర్ వరకు చదువుకునే పిల్లలందరికీ రూ.15 వేలిస్తామని 13 వేలకు తగ్గించారు. తొలేడాది ఇవ్వలేదు. రెండవ ఏట పథకాన్ని ప్రారంభించారు. దానికి అనేక షరతులు విధించారు. ఎంత మందికి ఎప్పటికి జమ అవుతాయో! తల్లుల నిరీక్షణపై చెప్పనలవి కాదు.

విద్యకు అన్ని వేల కోట్లు ఇన్ని వేల కోట్లని ప్రభుత్వం చెప్పడమే తప్ప ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పరిస్థితి మారిందేమీ లేదు. టాయిలెట్లు, వంట శాలలు, ప్రహరీగోడలు లేని స్కూళ్లు వేలల్లో ఉన్నాయి. చెట్ల కింద క్లాసులు, పైకప్పు పెచ్చులూడి పడుతున్న బడులు తక్కువేమీ కాదు. గత ప్రభుత్వంలో నాడు-నేడుతో కొంత వరకు సదుపాయాలు మెరుగైనా ఇంకా పెద్ద సంఖ్యలో సూళ్లుశిథిలావస్థలోనే ఉన్నాయి. ఎఐ, ఐటి కొత్త పుంతలు తొక్కుతుండగా ప్రభుత్వ బడులు సమస్యల్లో కునారిల్లడం ఇక్కడి పాలకుల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం. బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ ఏనాడో చెప్పింది. కూటమి సర్కారు ప్రతిపాదించింది 10 శాతం మాత్రమే. చివరాఖరికి ఎంత ఖర్చు చేస్తారో అనుమానమే. గతంలోనూ అంతే. ఈ విధానాలతో అద్భుతాలు సృష్టిస్తామనడం, అంతర్జాతీయ ప్రమాణాలనడం వంచనగా భావించాలి. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఎ.పి. అక్షరాస్యత 72.6 శాతం. మహిళలు, ఎస్‌సి, ఎస్‌టిలలో ఇంకా తక్కువ. ఇప్పటికైనా సార్వజనీన విద్య ప్రభుత్వరంగంతోనేనని గుర్తించేనా..?

సందర్భం

తెగింపే ఊపిరైన రోజు విప్లవం మొదలవుతుంది. బానిసత్వాన్ని ప్రశ్నించి తిరగబడిన రోజు పోరాటమే బలమవుతుంది. ధైర్యమే ఇంటి పేరుగా చరిత్రలో పేరు నిలిచిపోతుంది.
- చే గువేరా

జననం : 14.6.1928
మరణం : 9.10.1967

వ్యాఖ్య

జిడిపి సంబరాలు - భారతీయుల వాస్తవ స్థితిగతులు

సంపద పున: పంపిణీ విధానాలు మృగ్యం అయినప్పుడు సంపన్న వర్గాలు ప్రజా సేవల రంగాన్ని వదలిపెట్టి కేవలం ప్రత్యేకమైన ప్రైవేటు స్కూళ్లు, కార్పొరేట్ ఆస్పత్రులు, గేటెడ్ కమ్యూనిటీలను ఎంచుకోగలవు. దాంతో ప్రజాసేవల వ్యవస్థలపై పెట్టుబడులు పెట్టాలనే రాజకీయ సంకల్పం మరింత సన్నగిల్లిపోతుంది. కనీస పౌష్టికాహారం, గృహ వసతి, ఆరోగ్య రక్షణ కోసం తంటాలు పడే 80 కోట్ల మంది భారతీయులకు జిడిపి ర్యాంకులు ఏ మాత్రం అక్కరకు వచ్చేవి కావు.

భారతదేశం ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని నీతి ఆయోగ్ సిఇవో ఘంటాపథంగా ప్రకటించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్) ప్రపంచ ఆర్థిక గమనంపై వేసిన అంచనాలలో భాగంగా 2025-26కు సంబంధించి ఇచ్చిన భవిష్యత్ చిత్రణను బట్టి ఈ మాట చెబుతున్నామని ఒప్పుకోవడం ద్వారా ఆయన కొంత నిజాయితీ చూపించారు. మరిన్ని వివరణలు వచ్చాక మనకు విషయమేంటో మరింత ఖచ్చితంగా అర్థమైంది. జపాన్ జిడిపి 4,186.431 కోట్ల డాలర్లయితే దానికన్నా వెంట్రుక వాసి ఆధిక్యతతో భారతదేశ జిడిపి 4,187.017 కోట్ల డాలర్లకు చేరిందని తేలింది. భారతీయుల తలసరి ఆదాయం డాలర్లలో చూస్తే జపాన్‌లో పదమూడవ వంతు మాత్రమే వుందనేది పూర్తిగా వేరే విషయం.

అందువల్లనే మోడీ సర్కారు ఆర్థిక నిపుణుల బృంద సమర్థకులు ఇంతగా ఉబ్బితబ్బిబ్బు కావడం. దాన్ని గోడీ మీడియా వంధిమాగధులు మరింత ఊదరగొట్టడం విడ్డూరమైన విషయం. వాస్తవానికి జిడిపి స్థూల లెక్కలలోనే మునిగితేలడం ఇక్కడ యాదృచ్ఛికమేమీ కాదు. ద్రవ్య పెట్టుబడి ఆదేశాలతో నడిచే నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ కొలబద్ద లక్షణమే అది. ప్రజల పరిస్థితులను, జీవనోపాధి తీరును వెల్లడించే దానికన్నా కప్పిపుచ్చడమే ఎక్కువ జరుగుతుంది. ఇది ప్రపంచమంతటా వున్న ధోరణే కానీ భారత దేశంలో మరీ ఎక్కువగా నడుస్తున్నది. ఎందుకంటే ప్రపంచంలోనే అసమానతలు అత్యధికంగా వుండే దేశంగా దాన్ని చూస్తున్నారు.

2022 ప్రపంచ అసమానతల నివేదిక లెక్కల ప్రకారం భారతదేశ జనాభాలో అత్యగ్ర భాగాన వున్న ఒక్క శాతం మంది 40 శాతం పైగా జాతీయ సంపదను కలిగివున్నారు. అట్టడుగున వుండే 50 శాతం మంది చేతిలో కేవలం 3 శాతం సంపద మాత్రమే వుంది. బాగా పైనున్న పది శాతం మంది చేతుల్లో 57 శాతం జాతీయాదాయం వుండటంలోనూ ఇదే ఆర్థిక అసమానత మరీ ఘోరంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో చూస్తే స్థూల జిడిపి లేదంటే తలసరి జిడిపి లెక్క కూడా పక్కదోవ పట్టించేదే అవుతుంది. కార్పొరేట్ మతతత్వ కూటమి సాగిస్తున్న క్రూరత్వం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఉద్దేశపూరకంగా కల్పించిన సృష్టి.



వాస్తవానికి జిడిపి స్థూల లెక్కలలోనే మునిగితేలడం ఇక్కడ యాదృచ్ఛికమేమీ కాదు. ద్రవ్య పెట్టుబడి ఆదేశాలతో నడిచే నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ కొలబద్ద లక్షణమే అది. ప్రజల పరిస్థితులను, జీవనోపాధి తీరును వెల్లడించే దానికన్నా కప్పిపుచ్చడమే ఎక్కువ జరుగుతుంది. ఇది ప్రపంచమంతటా వున్న ధోరణే కానీ భారత దేశంలో మరీ ఎక్కువగా నడుస్తున్నది. ఎందుకంటే ప్రపంచంలోనే అసమానతలు అత్యధికంగా వుండే దేశంగా దాన్ని చూస్తున్నారు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

తెర వెనక వ్యూహమేంటి?

దీని వెనక వ్యూహం స్పష్టంగా బలంగా కనిపిస్తూనే వుంది. 'బే జోక్యం (జోక్యం లేకుండా) అనే సైద్ధాంతిక తెర మాటున సామాజిక జీవితానికి సంబంధించిన అన్ని రంగాలలోనూ ఆధిపత్య పథకాలను రుద్దడం కోసం రాజ్యం అధికారాన్ని పద్ధతి ప్రకారం ఉపయోగించుకుని దోపిడీ సామాజిక పెత్తనం సాగించడమే' బ్రెజిల్ ప్రముఖ ఆర్థికవేత్త ఆల్ఫ్రెడో సాద్‌ఫిలో 2006 లోనే వివరించారు. ద్రవ్యచోదిత నయా ఉదార వ్యవస్థలో అదే రుగుతుందని ఆయనన్నారు. ద్రవ్య మార్కెట్లు, అమెరికా పెట్టుబడి అంతర్జాతీయ ప్రయోజనాల హుకుంల దెబ్బకు పెట్టుబడి ప్రధాన పని సరుకులు సేవల ఉత్పత్తి కాకుండా పోయింది. దానికి మారుగా ఇప్పుడు పెట్టుబడి ప్రధానంగా స్పెక్యులేషన్ ద్రవ్య కార్యకలాపాల ద్వారా స్వల్పకాలిక సూపర్ లాభాల ఆర్జన కోసం ఉపయోగించబడుతున్నది.

పెట్టుబడికి సంబంధించిన మూడు ప్రధాన వనరులు అంటే ప్రభుత్వ ద్రవ్యం, దేశీయ పొదుపు మొత్తం, దేశ విదేశీ పెట్టుబడుల అనుసంధానం అన్నవాటిపై అంతకంతకూ నియంత్రణ లేకుండా పోవడం, ఒక చోట పోగుపడటం పెరుగుతున్నది. ద్రవ్య పెట్టుబడి ఇందుకు మధ్యవర్తిత్వం వహిస్తున్నది. తమ దేశంలో ఉత్పాదక రంగ ఉద్యోగాలను పునరుద్ధరించుకోవడం కోసం ట్రంప్ ప్రభుత్వం బరితెగించి సాగించిన టారిఫ్ యుద్ధంలో ఈ తర్కమే కనిపించింది, విచిత్రమేమంటే అమెరికా సామ్రాజ్యవాదం ఆధ్వర్యంలోనే ద్రవ్య పెట్టుబడి ప్రపంచాధిపత్యం మొదట నెలకొన్నది.

అంతులేని అగాధం

ఈ శతాబ్ది ప్రారంభం నాటికి (అంటే 2000కు) ప్రపంచ విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్.ఐ.ఐ) 400 లక్షల కోట్ల డాలర్లు వుండేవి. దాంతో పోలిస్తే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కేవలం 65 లక్షల కోట్లు డాలర్లు మాత్రమే వుండేవి. ఒక డాలరు ప్రత్యక్ష పెట్టుబడి అనుకుంటే స్టాక్‌లు, డెరివేటివ్‌ల వంటి స్పెకులేషన్ సాధనాల్లోకి ఏడు డాలర్లు తరలించబడేవి. పావు శతాబ్దం అంటే 25 ఏళ్ల తర్వాత ద్రవ్య పెట్టుబడి తాలూకూ ఈ ఆధిపత్యం మరింత పెరిగింది. స్పష్టంగా చెప్పాలంటే ఐ.ఎం.ఎఫ్ చెబుతున్న ఈ భవిష్యత్ లెక్కల చిత్రణ సమకాలీన పెట్టుబడిదారీ వ్యవస్థ వివరాలను గానీ, శ్రామికవర్గంపై దాని వినాశకర ప్రభావాలను గానీ ఏ మాత్రం చెప్పజాలదు.

భారతదేశ జనాభాలో అత్యగ్రభాగాన వున్న ఒక్క శాతం మంది 40 శాతం పైగా జాతీయ సంపదను కలిగివున్నారు. అంటే 140 కోట్ల మందికి కేవలం వార్షిక తలసరి ఆదాయం సుమారు 1670 డాలరుల మాత్రమే. 62 శాతం జాతీయ సంపదను అదుపు చేస్తున్న అగ్ర భాగంలోని అయిదు శాతం మందిని పక్కన పెడితే అప్పుడు వార్షిక ఆదాయం లక్ష రూపాయలు మాత్రమే అవుతుంది. దేశ జనాభాలో అత్యధిక భాగం ఎదుర్కొంటున్న కఠోర వాస్తవ పరిస్థితులేమిటో ఇదే చెబుతుంది.

సాదాసీదా రంగాలకు చేటు

జిడిపిలో వివిధ రంగాల వారీ వాటాల మధ్య విపరీతమైన వ్యత్యాసాల కారణంగా ఈ అసమానతలు మరింత సంక్లిష్టమవుతున్నాయి. జిడిపిలో అధిక భాగం భారీగా పెట్టుబడులు అవసరమైన సేవల రంగం నుంచి, పెద్ద కార్పొరేట్ సంస్థలదే. మరోవైపున అసంఘటిత, యథాలాప రంగాలలోనూ వ్యవసాయంలోనూ నిమగ్నమై వున్న శ్రామికులకు జిడిపిలో నామకార్థపు భాగమే వుంటోంది. ఫలితంగా నిరుద్యోగం పెరుగుదలకు తోడు నికరమైన ఆదాయాలు, జీవనోపాధి లోతైన సంక్షోభం ఎదుర్కొంటున్నాయి.

అంతర్జాతీయంగా చూస్తే ధనాఢ్య వర్గాలు పన్ను విధానాలను, నియంత్రణా వ్యవస్థలను, ప్రభుత్వ పెట్టుబడి నిర్ణయాలను చేజిక్కించుకుని. తమకు లాభదాయకంగా వుండేలా మలుచుకుంటున్నారు. భారత దేశంలో అయితే ఈ ప్రక్రియ మరింత తీవ్రంగా నడుస్తున్నది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం విజృంభణకు తోడుగా కార్పొరేట్ ప్రయోజనాల ఉక్కుపట్టుతో ప్రజల ఆస్తులు, ప్రకృతి వనరులు పథకం ప్రకారం ప్రైవేటు చేతుల్లోకి బదలాయింబడుతున్నాయి. కార్పొరేట్ల లాభాలు అపారంగా పెరిగిపోతుంటే జాతీయాదాయంలో శ్రామికుల వాటా తీవ్రంగా తగ్గిపోతున్నది. మన దేశంలో పరిస్థితి ప్రత్యేకించి ప్రమాదకరంగా వుంది. సాదాసీదా (ఇన్‌ఫార్మల్) ఆర్థిక వ్యవస్థను నోట్ల రద్దు పెద్ద దెబ్బ కొట్టింది. కోవిడ్-19 తర్వాత ఈ పరిస్థితి ఇంకా దిగజారింది. ఇలాంటి వాతావరణంలో అదనపు ఉద్యోగాల కల్పనకు గానీ, స్థిరమైన ఆదాయాల కల్పనకు గానీ అవకాశం లేదు.

జిడిపి నామకార్థంగా పెరుగుదలలోనైనా జాతీయ సంపదలో భాగస్వామ్యం లేదు. పేద శ్రామికులు, నిరుద్యోగులే గాక మధ్య తరగతి వర్గీయులు కూడా మరింతగా దెబ్బ తింటున్నారు, వారు వెనకబడిపోవడమే కాదు, ఇంకా కిందకు దిగజారే ముప్పు కనిపిస్తున్నది.

ప్రజావసరాల నిర్లక్ష్యం

సంపద పున:పంపిణీ విధానాలు మృగ్యం అయినప్పుడు సంపన్న వర్గాలు ప్రజా సేవల రంగాన్ని వదలిపెట్టి కేవలం ప్రత్యేకమైన ప్రైవేటు స్కూళ్లు, కార్పొరేట్ ఆస్పత్రులు, గేటెడ్ కమ్యూనిటీలను ఎంచుకోగలవు. దాంతో ప్రజాసేవల వ్యవస్థలపై పెట్టుబడులు పెట్టాలనే రాజకీయ సంకల్పం మరింత సన్నగిల్లిపోతుంది. కనీస పౌష్టికాహారం, గృహ వసతి, ఆరోగ్య రక్షణ కోసం తంటాలు పడే 80 కోట్ల మంది భారతీయులకు జిడిపి ర్యాంకులు ఏ మాత్రం అక్కరకు వచ్చేవి కావు.

కార్పొరేట్ మతతత్వ కూటమి విజృంభణ కేవలం యాదృచ్ఛికంగా జరిగిందేమీ కాదు. అది ప్రజలను అస్తిత్వాల ప్రాతిపదికన విభజించి పాలనా వ్యవస్థ ప్రాబల్యం కొనసాగేలా చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఉమ్మడిగా కలసికట్టుగా పోరాటాలు చేయడమే ముందుకు తీసుకు వెళ్లగల సరైన మార్గమవుతుంది.

(జూన్ 11 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

విశ్లేషణ

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక - నీతి ఆయోగ్ వ్యూహం

మొత్తంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బడా కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంలోకి తీసుకెళ్లడంలో భాగమే నీతి ఆయోగ్ ముందుకు తీసుకొచ్చిన విశాఖ రీజియన్ ఆర్థిక అభివృద్ధి ప్రణాళిక. ఈ ప్రాంత సహజ వనరులు, ఖనిజ సంపద, ప్రజల ఆస్తులు, ప్రభుత్వ పెట్టుబడులతో నిర్మించిన మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, శ్రమశక్తిని విచ్చలవిడిగా కొల్లగొట్టడం ద్వారా దేశ, రాష్ట్ర కేంద్రీకృత స్థూల ఉత్పత్తిని పెంచాలనేది రాష్ట్ర తెలుగుదేశ కూటమి-కేంద్ర బిజెపి సర్కార్ పన్నాగం. ఈ దోపిడీ వ్యూహాన్ని వెనక్కి కొట్టడమే రాష్ట్ర ప్రజల ముందున్న కర్తవ్యం.

బి. గంగారావు

నీతి ఆయోగ్ తయారు చేసిన విశాఖపట్నం ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలోని ముఖ్య అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల విడుదలచేశారు. ఈ ప్రణాళికతో రాబోయే ఏడేళ్లలో విశాఖ మరో ముంబైగా మారుతుందని ఆయన ప్రకటించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, అనకాపల్లి, అల్లూరి, తూర్పు గోదావరి, కాకినాడ మొత్తం 8 జిల్లాలు విశాఖ ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి ప్రాజెక్టులో ఉన్నాయని తెలిపారు.

వికసిత్ భారత్ 2047లో భాగంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో విశాఖపట్నం, ముంబై, వారణాసి, సూరత్ నగరాలను గ్రోత్ హబ్ లుగా నిర్ణయించి ఆ నగరాల చుట్టూ ఉన్న కొన్ని జిల్లాలను కూడా కలుపుకొని ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసింది. ఈ ప్రక్రియ 2023లో ప్రారంభించి 2024లో ముంబై, సూరత్ ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలను నీతి ఆయోగ్ ప్రకటించింది. విశాఖపట్నం, వారణాసి నగరాల పూర్తి స్థాయి ప్రణాళికలను త్వరలో ప్రకటించనున్నారు. మొత్తం ఈ 8 జిల్లాల రీజియన్ 36 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కోటి 55 లక్షల జనాభా కలిగి వుంది. ప్రస్తుతం 49 బిలియన్ డాలర్లు విలువగల స్థూల ఉత్పత్తికి ఈ ప్రాంతం ప్రాతినిధ్యం వహిస్తున్నది. దీనిని 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల విలువ స్థూల ఉత్పత్తికి పెంచాలనే లక్ష్యం పెట్టుకున్నారు. దీనికి పోర్టులు, ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, పట్టణీకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటివి 7 గ్రోత్ ఇంజన్లుగా ఉంటాయి. వీటిల్లో 41 ప్రాధాన్యతా ప్రాజెక్టులతో కూడిన 6 పోర్టులు, 7 పారిశ్రామిక జోన్లు, 17 మేజర్ వ్యవసాయ క్షేత్రాలు, 6 సర్వీస్, 12 పర్యాటక హబ్‌లను అభివృద్ధి చేయలనే లక్ష్యాలను పెట్టారు. వీటికోసం లక్ష ఎకరాల భూమిని రైతుల నుండి సేకరించనున్నారు. ఇదికాక లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు, అటవీ భూములను కూడా ఈ ప్రణాళికకు ఉపయోగించనున్నారు. ఇప్పుడు స్వర్ణాంధ్ర ప్రదేశ్ విజన్ 2047 అమలు పేర రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను టాటా, ఎల్ అండ్ టీ, భారత్ బయో టెక్, అపోలో హాస్పిటల్స్, రెడ్డీస్ ల్యాబొరేటరీస్ వంటి కార్పొరేట్ దిగ్గజాల చేతుల్లో పెడుతూ ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలనే ఇచ్చింది. ఈ కమిటీ ఇకనుండి రాష్ట్రం లోని పారిశ్రామిక, ఆర్థిక రంగంలో జరుగుతున్న అభివృద్ధిని సమీక్షించటం, పెట్టుబడుల స్వేచ్ఛకు ఆటంకాలుగా ఉన్న నిబంధనలను తొలగించేందుకు, సరళీకరణ విధానాలను వేగంగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని చంద్రబాబు నాయుడు ఆ జీవోలో పేర్కొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసమే కూటమి అన్నారు నేతలు. తీరా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఇదేనా రాష్ట్రాభివృద్ధి అంటే!

రాష్ట్రంలో విశాఖ రీజియన్ అనేక ప్రత్యేకతలు కలిగి వుంది. దాదాపు 400 కిలోమీటర్లు పొడవుగల సముద్ర తీరం ఉంది. బాక్సైట్, మైకా, క్వార్ట్ జైట్ వంటి అనేక ఖనిజ నిక్షేపాలకు తూర్పు కనుమలు నిలయం. రాష్ట్ర అటవీ ప్రాంతంలో సగభాగం ఈ ప్రాంతంలోనే ఉంది. అరుదైన కాఫీ పంటలకు గిరిజన ప్రాంతం కీలకంగా ఉంది. రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం కలిగి అనేక జీవనదులతో, సకల పంటలకు అనువైన వాతావరణంతో అత్యంత సారవంతమైన భూములు కలిగి ఉంది. లక్షల ఎకరాల్లో ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయి. మరో ముఖ్యమైనది ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ పెట్టుబడులతో అనేక రకాల మౌలిక సదుపాయాలు కలిగివున్న ప్రాంతం. అంతేకాక దేశంలో భారీ ఖనిజ సంపదకు నిలయంగా ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిషా వంటి రాష్ట్రాలకు ఈ రీజియన్ అత్యంత వ్యూహాత్మక ప్రాంతంగా ఉంది.

స్థూలంగా చెప్పాలంటే ఇది ప్రైవేట్ పెట్టుబడిదారుల లాభాలకు చాలా అనువైన ప్రాంతంగా ఉంది. త్వరితగతిన సహజ సంపదను కొల్లగొట్టటానికి అవకాశం ఉన్న ప్రాంతం. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి వ్యూహంగా ఈ రీజియన్‌ను ముందుకు తీసుకొచ్చాయి. అంతేగానీ ఈ ప్రాంతం యొక్క రెండో పార్శ్వమైన అత్యంత వెనుకబడిన ప్రాంతంగానూ, అభివృద్ధిలో అట్టడుగున వున్న లక్షల కొలది గిరిజనులు, సముద్ర తీరాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న అతి పేద మత్స్యకారులు, జనాభాలో అత్యధిక మంది నిరుపేదలు, చిన్న, సన్నకారు రైతులతో నిత్యం వలస బారిన పడుతున్న వారి అభివృద్ధి కోసం ఈ ప్రాంతాన్ని ఎంపిక చేయలేదనేది వాస్తవం. ఇప్పటికే విశాఖపట్నం చుట్టూ స్పెషల్ ఎకనామిక్ జోన్స్, ఫార్మా, హబ్, అపెరల్ పార్కులు, మెడ్ టెక్ జోన్స్, పెట్రో కెమికల్ కారిడార్, పారిశ్రామిక నోడ్‌లు ఇలా అనేక పేర్లతో లక్షల ఎకరాలు రైతుల నుండి లాక్కొని పెట్టుబడిదారులకు కట్టబెట్టారు.

వ్యవసాయ రంగ అభివృద్ధి నమూనాను పరిశీలిస్తే మొత్తం 8 జిల్లాల పరిధిలో ఎగుమతి ఆధారిత, ఆహార ప్రాసెసింగ్, పకృతి వ్యవసాయ, వాణిజ్య కేంద్రంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావాలని పేర్కొన్నారు. 17 అతి పెద్ద ప్రైవేట్ వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పబోతున్నారు. కొన్ని జిల్లాలను పూర్తిగా ప్రకృతి వ్యవసాయంగా మారుస్తారు. ఉదాహరణకి సూరత్ ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలో డాంగ్ అనే జిల్లాను పూర్తిగా ప్రకృతి వ్యవసాయ జిల్లాగా మార్చేశారు.

ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ రంగ దుస్థితి, రైతుల పరిస్థితి, పంటలకు ప్రభుత్వ మద్దతు, ప్రభుత్వ మార్కెటింగ్, పెట్టుబడి కల్పన వంటివి ఎక్కడా ఈ నమూనాలో కనిపించవు. రాష్ట్ర వ్యవసాయ రంగం నేడు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లేకపోగా వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి తీసుకెళ్ళేలా ఉంది. కార్పొరేట్ వ్యవసాయానికి రాచబాట వేస్తున్నారు. ఆహార భద్రతకు తీవ్ర ముప్పు కలుగుతుంది. ప్రాథమిక ఆహార పంటలను, వాటి ధరలను దెబ్బతీస్తారు. చిన్న సన్నకారు రైతులు భూములను కోల్పోవాల్సి ఉంటుంది. ఈ మార్పులు వ్యవసాయ ఉపాధిని దారుణంగా దెబ్బ తీసి వలసలను తీవ్రతరం చేస్తాయి. మొత్తం ఈ రీజియన్‌లో 7చోట్ల పారిశ్రామిక కేంద్రాలను కొత్తగా నెలకొల్పనున్నారు. వీటికి 70 వేల ఎకరాల భూమిని సేకరిస్తారు. ఇవన్నీ ప్రైవేట్ పెట్టుబడులతో నిర్మాణం చేపడతారు. ప్రభుత్వం వీటికి అవసరమైన భూములను, జాతీయ రహదారులు, రైలు మార్గాల అనుసంధానం, మౌలిక సదుపాయాలను కల్పించటం, పన్నుల రాయితీలు ఇస్తుంది. అయితే వీటిల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు చోటులేదు. పెద్ద పెద్ద బడా పెట్టుబడులతో ఒప్పందాలు చేసుకుంటారు. ఈ ఆర్థిక సంక్షోభంలో పెద్దగా పరిశ్రమలు రాకపోయినా భూములు మాత్రం పెద్దఎత్తున సమర్పిస్తారు. వచ్చే వాటిల్లో ఎక్కువ భాగం కాలుష్యాన్ని వెదజల్లే కెమికల్ పరిశ్రమలే ఉంటాయి. అలాగే మూడు దిగ్గజ ఉక్కు కంపెనీలతో స్టీల్ హబ్‌ను ఏర్పాటు చేస్తారట. ఇప్పటికే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాలు పాల్జేసి, కార్మికులను తొలగిస్తూ దాని మెడపై ప్రైవేటు కత్తి వేలాడదీస్తూ నక్కపల్లి వద్ద చేపట్టబోయే మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సర్వం సమకూరుస్తున్నాయి. విశాఖ నగరంలో ఉన్న మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను వివిధ రూపాల్లో బడా కార్పొరేట్ శక్తుల పరం చేస్తారు.

టూరిజంను బడా పెట్టుబడులతో అభివృద్ధి చేయాలని, దేశీయ సంపన్నులనే కాక విదేశీయులను కూడా ఆకర్షించేలా పెద్ద పెద్ద స్టార్ హోటళ్లు, రిసార్టులు, సర్వీస్ అపార్టమెంట్లు, క్రూస్ టూరిజం, థీమ్ పార్కులు, డిస్నీ వరల్డ్ వంటివి నిర్మించాలని పేర్కొన్నారు. దీనికి ఆటంకంగా ఉండే చిన్న, సన్నకారు ఉత్పత్తిదారులు ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతం పొడవునా ఉన్న లక్షలాది మంది మత్స్యకారులను తరిమివేస్తారు. విస్తారమైన ఏజెన్సీ ప్రాంతంలో కూడా ఈ తరహా పెట్టుబడులతో టూరిజంను ముందుకు తీసుకెళ్లాలనేది వీరి ప్రణాళిక. మరో ముఖ్యమైనది రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను పెద్ద ఎత్తున బహు ముఖంగా ఈ రీజియన్‌లో అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. దేశ స్థూల జాతీయోత్పత్తిలో నేడు రియల్ ఎస్టేట్ రంగం కీలక పాత్ర పోషిస్తున్నది. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం నుండి బయటపడటానికి రియల్ ఎస్టేట్ రంగాన్ని ఒక ప్రధానమైన రంగంగా ఎంచుకున్నారు. మొత్తంగా దేశంలో ఈ రంగంలో బడా పెట్టుబడులతో బూమ్‌ను తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా నేడు దేశ స్థూల జాతీయోత్పతిలో 7.3 శాతంగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగ వాటాను 15.5 శాతానికి అంటే 5.8 ట్రిలియన్ డాలర్ల విలువకు 2047 నాటికి పెంచాలని వికసిత్ భారత్‌లో పేర్కొన్నారు. అలాగే ఆంధ్ర రాష్ట్రంలో కూడా ఈ రంగాన్ని విస్తారంగా ముందుకు తీసుకెళ్లాలని భావించారు. అమరావతి రాజధాని నిర్మాణ నమూనా కూడా ఈ వ్యూహంలో భాగమే. ఇప్పుడు శ్రీకాకుళం మూలపేట నుండి కాకినాడ వరకు సముద్ర తీరం పొడవునా అనేక చోట్ల గ్రీన్ ఫీల్డ్ ప్రపంచ శ్రేణి నగరాలు, స్మార్ట్ సిటీలు, గేటెడ్ కమ్యూనిటీలు, పట్టణ ప్రాంతాలకు దగ్గరగా అత్యంత విలాసవంతమైన ఎత్తైన గృహ సముదాయాలు నిర్మించి తద్వారా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పెంచనున్నారు. వీటికి అనుబంధంగా పెద్ద పెద్ద విద్యా సంస్థలు, క్రీడా మైదానాలు, లగ్జరీ మాల్స్ వంటివి అనేకం రూపుదిద్దుకునేలా ప్రణాళికలో పొందుపర్చారు.

ఈ రీజియన్ ఆర్థిక నమూనాలో అత్యంత ప్రమాదకరమైనది...5వ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన ప్రాంతంలోని ఖనిజ సంపదను మొత్తాన్ని దోచుకోవాలనే వీరి వ్యూహం. గత రెండు దశాబ్దాల నుండి బాక్సైట్ నిక్షేపాలను బడా సంస్థలకు కట్టబెట్టడానికి పాలకులు తీవ్ర ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం 1/70 వంటి చట్టాలను కూడా ధిక్కరించి అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు హైడ్రో విద్యుత్, గ్రీన్ ఎనర్జీ పేర విద్యుత్ కేంద్రాలను నెలకొల్పడానికి మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వేల ఎకరాలు అటవీ, గిరిజనుల భూములను ధారాదత్తం చేసింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దీనిని మరింత వేగంగా గిరిజన ప్రాంతంలో ముందుకు తీసుకుపోతున్నది. ఈ చర్యలు ఆదివాసుల జీవితాలను విధ్వంసం చేస్తాయి. అటవీ ప్రాంతంపై వీరికున్న హక్కులను హరించి వేస్తాయి. అటవీ ప్రాంతం నుండి వీరిని దూరం చేస్తాయి. మొత్తం అటవీ ప్రాంతంపై కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం పెంచుతుంది. ఇది సహజ వనరులను లూటీ చేయడమే కాక తీవ్ర పర్యావరణ సమస్యలను కూడా సృష్టిస్తుంది.

స్థూల ఉత్పత్తి పెంచాలనే లక్ష్యంతో ప్రైవేట్ పెట్టుబడుల ప్రయోజనాల కోసం మొత్తం భూ వినియోగంలో సామాజిక ప్రయోజనాలను దెబ్బ తీసి భూ చట్టాలను మరింత సరళతరం చేసి భూ కేంద్రీకరణను పెంచనున్నారు. సముద్ర తీరం మొత్తాన్ని గుండు గుత్తుగా కార్పొరేట్ల పరం చేయనున్నారు. ఇందుకోసం తీర ప్రాంత నియంత్రణలన్నింటినీ మరింత సరళతరం చేయనున్నారు. స్థూల ఉత్పత్తి పెరుగుదలకు ఆటంకం అనే పేర నామమాత్రంగా వున్న కార్మిక చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేస్తారు. ఇప్పటికే నాలుగు లేబర్ కోడ్లుగా కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం మార్చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను విచ్చలవిడిగా దోచుకునేలా పని గంటల్లో అనేక నిబంధనలలో మార్పు చేసింది. కార్మిక వర్గంపై క్రూరమైన దాడికి ప్రభుత్వం పాల్పడుతోంది.

మొత్తంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బడా కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంలోకి తీసుకెళ్లడంలో భాగమే నీతి ఆయోగ్ ముందుకు తీసుకొచ్చిన విశాఖ రీజియన్ ఆర్థిక అభివృద్ధి ప్రణాళిక. ఈ ప్రాంత సహజ వనరులు, ఖనిజ సంపద, ప్రజల ఆస్తులు, ప్రభుత్వ పెట్టుబడులతో నిర్మించిన మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, శ్రమశక్తిని విచ్చలవిడిగా కొల్లగొట్టడం ద్వారా దేశ, రాష్ట్ర కేంద్రీకృత స్థూల ఉత్పత్తిని పెంచాలనేది రాష్ట్ర తెలుగుదేశ కూటమి-కేంద్ర బిజెపి సర్కార్ పన్నాగం. ఈ దోపిడీ వ్యూహాన్ని వెనక్కి కొట్టడమే రాష్ట్ర ప్రజల ముందున్న కర్తవ్యం.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

రూ.5700 కోట్ల స్త్రీనిధి రుణాలు

- అర్హులకు రూ.50 వేల నుండి లక్ష
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్త్రీనిధి పథకం కింద ఈ ఏడాది రూ.5700 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలనసంస్థ(సెర్ప్) మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సెర్ప్ కార్యాలయంలో శుక్రవారం స్త్రీనిధి సిబ్బందితోపాటు రాష్ట్రంలో 26 జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లు, సంబంధిత సిబ్బందితో మంత్రి త్రైమాసిక ప్రగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద అర్హులైన మహిళలకు రూ.50 వేల నుండి లక్ష రూపాయల వరకు తక్కువ వడ్డీరేటుతో రుణాలు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. స్త్రీనిధి కార్యకలాపాల డిజిటలైజేషన్‌లో భాగంగా ఇటీవల ప్రారంభించిన రికవరీ యాప్ వినియోగంపై పొదుపు సంఘాలకు సమగ్ర అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతిరోజూ రుణాల రికవరీ కోసం వసూలు చేసిన మొత్తాన్ని ఏ బ్యాంకులో జమచేశారన్న సమాచారాన్ని వీడియో ద్వారా ఆదరోజున స్త్రీనిధి విభాగానికి సమర్పించాలన్నారు. సిబిఎఫ్ రుణాలు స్త్రీనిధి ద్వారా పంపిణీ చేయాలని, మంజూరు, రికవరీ పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. సిబిఎఫ్ ఫండ్ మేనేజ్‌మెంట్ చేయడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పద్ధతులు గమనించి పారదర్శకతను తీసుకురావడమే కాకుండా వసూలులో వేగం, సమర్థత పెంచుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇక నుండి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాల్లో కొందరు ప్రాజెక్టు సిబ్బంది రుణాలు దుర్వినియోగం చేశారని, ఇలాంటి చర్యలను ఇక ముందు ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అటువంటి ఘటనలు జరిగితే కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్త్రీనిధి ఎమ్‌డి హరిప్రసాదు, అదనపు సిఇఓ ఆర్.శ్రీరాములునాయుడు, 26 జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు పాల్గొన్నారు.



బి వెంకట్‌కు చెకును అందజేస్తున్న పి అభిమన్యు

వ్యవసాయ కార్మికుల పోరాటానికి
బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల అండ

- రూ.2,18, 767 విరాళం ప్రకటన

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

వ్యవసాయ కార్మికుల పోరాటానికి బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు అండగా నిలిచారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘానికి (ఎఐఎడబ్ల్యుయు)కి రూ.2,18,767 విరాళం ప్రకటించారు. దానికి సంబంధించిన చెక్కును శుక్రవారం ఢిల్లీలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్, ఆఫీసు కార్యదర్శి బాబుకు బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పి అభిమన్యు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ..గ్రామీణ భారతదేశంలో కనెక్టివిటీని పెంచడంలో బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల పాత్రను నొక్కి చెప్పారు. అలాంటి సంస్థను నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తున్నదని విమర్శించారు. అభిమన్యు మాట్లాడుతూ..వ్యవసాయ, గ్రామీణ కార్మికులకు మద్దతుగా ఈ మొత్తాన్ని సేకరించడానికి వేలాది మంది బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు కలిసి వచ్చారని తెలిపారు. గ్రామీణ భారతదేశంలో పోరాటాలను బలోపేతం చేయడానికి, కూలీలు, కార్మికులు, ఉద్యోగుల ఐక్యతను పెంచడానికి ఇలాంటి సహాయాలు దోహదం చేస్తాయని ఆకాంక్షించారు. జూలై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అంబానీకి జెడ్ ప్లస్ భద్రతపై పిటిషన్ తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ : ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ, అతని కుటుంబానికి అందిస్తున్న జెడ్ ప్లస్ భద్రతను ఉపసంహరించుకోవాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ పిటిషన్‌ను వెనక్కితీసుకోవాలని పిటిషన్‌దారుడు బికాష్ సాహాను ఆదేశించింది. అంబానీకి జెడ్ ప్లస్ భద్రతను వ్యతిరేకిస్తూ పదేపదే పిటిషన్లు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించింది. ఈ పిటిషన్‌ను కొనసాగించినా, లేదా భవిష్యత్‌లో ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసినా జరిమానా విధిస్తామని హెచ్చరించింది. 'ప్రభుత్వం అందిస్తున్న భద్రతను సవాల్ చేయడానికి దరఖాస్తుదారునికి ఎటువంటి హక్కులేదు' అని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడి ద్విసభ్య వెకేషన్ బెంచ్ పేర్కొంది. ముఖేష్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీ, పిల్లలు అనంత్, ఆకాష్, ఇషాలకు అందిస్తున్న జెడ్ ప్లస్ భద్రతను కొనసాగించాలని తెలిపింది.

"ముప్పు అవగాహనను నిర్ణయించడానికి మీరెరు? భారత ప్రభుత్వం దానిని నిర్ణయిస్తుంది. రేపు, ఏదైనా ప్రమాదం జరిగితే, మీరు బాధ్యత తీసుకుంటారా? లేదా కోర్టు దానికి బాధ్యత వహిస్తుందా?" అని ప్రశ్నించింది.

నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణ

- భారత్-చైనా అంగీకారం

న్యూఢిల్లీ : భారత్ - చైనాల మధ్య నేరుగా విమాన సేవల పునరుద్ధరణను వేగవంతం చేయడానికి అంగీకారం కుదిరింది. ఈ విషయాన్ని ఇరు దేశాల విదేశాంగ మంత్రిత్వ శాఖలు శుక్రవారం ప్రకటించాయి. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న చైనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి సన్ వీడాంగ్, కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీల మధ్య సమావేశం తరువాత ఈ విషయాన్ని ప్రకటించారు. ఇరుదేశాలు తమ ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకుంటున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 'ఇరు దేశాల మధ్య వివాదాలను, విభేదాలను పరిష్కరించుకోవాలని, అంతర్జాతీయ, ప్రాంతీయ శాంతి, స్థిరత్వాలను కాపాడుకోవడంలో సంయుక్తంగా నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం' అని చైనా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత మంత్రిత్వశాఖ తన ప్రకటనలో 'ఇరు దేశాల మధ్య సంబంధాలను స్థిరీకరించడానికి, పునర్నిర్మించడానికి సమావేశంలో అంగీకారం కుదిరింది' అని తెలిపింది. హిమాలయ సరిహద్దు వెంబడి పెట్రోలింగ్‌కు సంబంధించి ఇరు దేశాలు గత అక్టోబర్‌లో ఒక ఒప్పందానికి వచ్చాయి. దీంతో రెండు దేశాల మధ్య 2020లో ప్రారంభమైన ప్రతిష్టంభన తొలగిపోయింది. తరువాత వాణిజ్యం, సాంకేతికత, విమాన ప్రయాణం వంటి రంగాల్లో ఒప్పందాలపై భారత్-చైనా దృష్టి పెట్టాయి.

అర్జెంటీనా మాజీ అధ్యక్షురాలు
క్రిస్టినా ఫెర్నాండెజ్‌కు ఆరేళ్ల జైలు

బ్యూనస్ ఎయిర్స్ : అర్జెంటీనా మాజీ అధ్యక్షురాలు క్రిస్టినా ఫెర్నాండెజ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ప్రస్తుత ప్రతిపక్ష నాయకురాలు, 72 ఏళ్ల ఫెర్నాండెజ్‌కు అవినీతి కేసులో ఆ దేశ సుప్రీంకోర్టు ఆరేళ్ల జైలు శిక్ష విధించింది. ఆమె జీవితాంతం ప్రజా పదవులు స్వీకరించకుండా నిషేధం విధించింది. పబ్లిక్ రోడ్‌వర్క్స్ కాంట్రాక్టులు ఇవ్వడంలో అవినీతికి పాల్పడ్డారన్న కేసులో నేరం రుజువైందని పేర్కొంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హోరాసియో రోసాట్టి, కార్లోస్ రోసెన్‌కాంట్జ్, రికార్డో లోరెంజెట్టి ఈ నెల 10న శిక్ష ఖరారు చేశారు. కోర్టు ముందు లొంగిపోవడానికి ఐదు రోజుల సమయం ఇచ్చారు. నెస్టర్ కిర్చ్నర్ అధ్యక్షులుగా ఉన్న సమయంలోనూ (2003 నుంచి 2007 వరకూ), తన సొంత అధ్యక్ష పదవీ కాలంలోనూ (2007 నుంచి 2015) వరకూ ఫెర్నాండెజ్ ఈ నేరాలకు పాల్పడినట్లు రుజువైంది. సెప్టెంబర్‌లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తానని ఈ నెల ప్రారంభంలోనే ఫెర్నాండెజ్ ప్రకటించారు. దీనికి కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ తీర్పు రావడం ఆమెకు ఎదురు దెబ్బగా భావిస్తున్నారు. ఈ తీర్పుపై ఫెర్నాండెజ్ తీవ్రంగా స్పందించారు. అర్జెంటీనా న్యాయవ్యవస్థ ఒక రాజకీయ పార్టీలా పనిచేస్తుందని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా, ఫెర్నాండెజ్‌కు మద్దతుగా వేలాదిమంది ఆమె అభిమానులు దేశవ్యాప్తంగా వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT GUNTUR

O.S. No. 514 OF 2024

Between:
M/s. Chaitanya Godavari Grameena Bank, (presently Andhra Pradesh Grameena Bank) Chebrolu Branch, Guntur District, Rep. by it's Branch Manager Office at Chebrolu Village & Mandal, Guntur District. .....**Plaintiff**

AND

1) **Sri Kanaka Mahalakshmi Joint Liability Group, Karempudipadu, Rep. by it's Convinor Totakura Vasu Babu, S/o. Veeraiah,** Karampudipadu Village, Mutluru Post, Vatticherukuru Mandal, Guntur Dt.
2) **Totakura Vasu Babu @ Vasu, S/o. Veeraiah,** Aged about 37 years, Occ: Agriculture, R/o.Door No. 1-88/A, Karampudi Padu Village, Mutluru Post, Vatticherukuru Mandal, Guntur District -522212.
3) **Nagisetti Venkata Rao, S/o. Srinivasa Rao,** Age about 34 Years, Occ: Agriculture, R/o.Door No.2-104/A, Karampudi Padu Village, Mutluru Post, Vatticherukuru Mandal, Guntur District -522212.
4) **Nagisetti Prasad, S/o. Venkata Swamy,** Aged about 47 years, Occ: Agriculture, R/o.Door No.1-66, Karampudi Padu Village, Mutluru Post, Vatticherukuru Mandal, Guntur District-522212.
5) **Totakura Veeraiah, S/o. Basavaiah,** Aged about 67 years, Occ: Agricultural, R/o. Door No.1-88/A, Karampudi Padu Village, Mutluru Post, Vatticherukuru Mandal, Guntur District-522212.
6) **Neelam Balaiah, S/o. Venkatramaiah,** Aged about 77 years, Occ: Agriculture, R/o.Door No. 2-24, Karampudi Padu Village, Mutluru Post, Vatticherukuru Mandal, Guntur District-522212. **Defendants**

పై నెంబరు దావాను వాది, బ్యాంకునకు రావలసిన బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా, సదరు దావాలో ప్రతివాదులు అయిన మీలో 6వ ప్రతివాది అయిన మీకు పైన తెలిపిన కోర్టు వారి నుండి దావా సమనులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమనులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని కోర్టు వారు సదరు దావాను **ది.27-06-2025** తేదీనకు వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10.30 ని॥లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట మీలో 6వ ప్రతివాది అయిన మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయరు గారి ద్వారా గాని హాజరై మీకుగల అభ్యంతరములను తెలుపుకొనగలరు. లేనిచో పైన తెలిపిన కోర్టు వారిచే చట్టప్రకారం మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం) వాయిదా తేది: 27-06-2025

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చబడినది చేబ్రోలు శాఖ, గుంటూరు జిల్లా వారి తరుపున

ఈమని నాగేంద్ర ప్రసాద్, B.A., M.B.A., LL.B
#26-19-98/2, New D.No.95-21-1006, 3/2 A.T Agraharam, Guntur-522 004. Ph: 9490542445, 7981901988

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1) M/s. సాయి శ్రీజ టొబాకో, ప్రొప్రయిటర్ : గొడుగుల వంశీ కృష్ణ, డి నెం.8-24-11, పద్మజ పెట్రోల్ బంక్ దగ్గర, మంగళగిరి రోడ్, గుంటూరు-522001.
2) శ్రీ గొడుగుల వంశీ కృష్ణ వర్మ, తండ్రి : గొడుగుల మురళీ వర్మ, హెచ్ నెం.7-16-316, RR రెసిడెన్సీ, ఫ్లాట్-A4, 7/7 శ్రీ నగర్, గుంటూరు-522002.
3) శ్రీ గొడుగుల వంశీ కృష్ణ వర్మ, తండ్రి : గొడుగుల మురళీ వర్మ, డి నెం.7-6-283, 2వ లైన్, వసంతరాయపురం, గుంటూరు.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి నోటీసు.

కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) సెక్షన్ 13(8) క్రింద చదవబడు రూల్ 8(6) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్స్ (ఇక మీదట "రూల్స్"గా రిఫర్ చేయబడును) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

లోను అకౌంట్ ఋణగ్రహీత/సంస్థ M/s. **సాయి శ్రీజ టొబాకో మరియు తనఖాదారు మరియు హామీదారు (పైన తెలుపబడిన పేర్లు)** వారిని బకాయి **రూ.91,22,319/- (అక్షరాల తొంభై ఒక్క లక్షల ఇరవై రెండు వేల మూడు వందల పంతొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** అధీకృత అధికారి **చట్టం నందలి సెక్షన్ 13(2) క్రింద 14.09.2016 వ తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది.10.02.2017** న మీ సెక్యూర్డ్ ఆస్తులను చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక / భౌతిక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి** (తెలుగు) & **ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్** (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది.16.02.2017 న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది.**06.06.2025** నాటికి **చెల్లించవలసిన** బకాయి **రూ. 4,43,46,670.80/- (అక్షరాల నాలుగు కోట్ల నలభై మూడు లక్షల నలభై ఆరు వేల ఆరు వందల డెబ్బై రూపాయల ఎనభై పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను సర్ఫేసీ చట్టం, 2002 నందలి రూల్ 8(6) క్రింద ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు చట్టప్రకారం దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం తనఖా ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన ఆస్తి వివరములు

గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, రామచంద్రపుర అగ్రహారం నెం.1053, పైమాషి నెం.79, డి నెం.9/2 మరియు గుంటూరు మున్సిపల్ కమీషనర్ ఫైల్ నెం.195/2013/TS తేది.13.03.2013 మరియు రామచంద్రపుర అగ్రహారం గ్రామం యొక్క ఎండోర్స్‌మెంట్ డి నెం.22/3B ప్రకారం విస్తీర్ణం ఎకరా 11.46 సెంట్లులోని ఎకరా 3.82 సెంట్లు స్థలం నందు విస్తీర్ణం 505.55 చ॥గ॥లు. **హద్దులు : తూర్పు** : డి. చంద్రశేఖర్ ప్రసాద్ గారి ఆస్తి – 70', **దక్షిణం** : 25 అ॥ల వెడల్పు రోడ్డు – 65', **పడమర** : డి. శ్రీదేవి మరియు ఇతరులు యొక్క ఆస్తి – 75', **ఉత్తరం** : డి. శ్రీదేవి మరియు ఇతరులు యొక్క ఆస్తి – 65'.

టైటిల్ హోల్డర్: శ్రీ గొడుగుల వంశీ కృష్ణ వర్మ, తండ్రి : గొడుగుల మురళీ వర్మ.

తేది: 06.06.2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1) శ్రీ నల్లూరి సుబ్బా రావు, తండ్రి : నల్లూరి శివ రామయ్య, ఫ్లాట్ నెం.416, 3వ అంతస్తు, సత్య కంఫర్ట్స్ అపార్ట్‌మెంట్స్, ద్వారకా నగర్, 9వ లైన్, గుంటూరు-522007.
2) శ్రీమతి నల్లూరి భారతి, భర్త : నల్లూరి సుబ్బా రావు, ఫ్లాట్ నెం.416, 3వ అంతస్తు, సత్య కంఫర్ట్స్ అపార్ట్‌మెంట్స్, ద్వారకా నగర్, 9వ లైన్, గుంటూరు-522007.
3) M/s. హర్షిత కాటన్ ట్రేడర్స్, ప్రొప్రయిటర్ : శ్రీ నల్లూరి సుబ్బారావు, ఫ్లాట్ నెం.416, 3వ అంతస్తు, సత్య కంఫర్ట్స్ అపార్ట్‌మెంట్స్, ద్వారకా నగర్, 9వ లైన్, గుంటూరు-522007.
4) శ్రీ నల్లూరి శివరామయ్య, తండ్రి : వెంకటప్పయ్య, ఫ్లాట్ నెం.416, 3వ అంతస్తు, సత్య కంఫర్ట్స్ అపార్ట్‌మెంట్స్, ద్వారకా నగర్, 9వ లైన్, గుంటూరు-522007.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి నోటీసు.

కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) సెక్షన్ 13(8) క్రింద చదవబడు రూల్ 8(6) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్స్ (ఇక మీదట "రూల్స్"గా రిఫర్ చేయబడును) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

లోను అకౌంట్ ఋణగ్రహీత/సంస్థ M/s **హర్షిత కాటన్ ట్రేడర్స్ & శ్రీ. నల్లూరి సుబ్బారావు మరియు తనఖాదారు మరియు హామీదారు (పైన తెలుపబడిన పేర్లు)** వారిని బకాయి **రూ.1,48,48,868/- (అక్షరాల ఒక కోటి నలభై ఎనిమిది లక్షల నలభై ఎనిమిది వేల ఎనిమిది వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** అధీకృత అధికారి **చట్టం నందలి సెక్షన్ 13(2) క్రింద 04.03.2022 వ తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది.30.05.2022** న మీ సెక్యూర్డ్ ఆస్తులను చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక / భౌతిక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి** (తెలుగు) & **ది హాన్స్ ఇండియా** (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది.02.06.2022 న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది.**06.06.2025** నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ. 39,69,227.99/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల అరవై తొమ్మిది వేల రెండు వందల ఇరవై ఏడు రూపాయల తొంభై తొమ్మిది పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను సర్ఫేసీ చట్టం, 2002 నందలి రూల్ 8(6) క్రింద ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు చట్టప్రకారం దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫెసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం తనఖా ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.
తనఖాపెట్టిన ఆస్తి వివరములు
గుంటూరు జిల్లా, నరసరావుపేట రెవెన్యూ డివిజన్, క్రోసూరు సబ్ డివిజన్, క్రోసూరు మండలం, పెసపాడు గ్రామ పంచాయితీ మరియు గ్రామం, డి నెం.34, అసెస్‌మెంట్ నెం.360, డి నెం. 3-183 నందు విస్తీర్ణం ఎకరా 12-40 సెంట్లులోని 121 చ॥గ॥లు లేదా 101.64 చ॥మీ॥లులోని ఆర్‌సిసి రూఫ్ ఇల్లు. **హద్దులు : తూర్పు :** పంచాయితీ బజార్ - 60 లింకులు, **దక్షిణం :** బూతుకూరి పెద మల్లారెడ్డి గారి ఆస్తి - 41 లింకులు, **పడమర :** బూతుకూరి పెద మల్లారెడ్డి కుమారుని యొక్క ఆస్తి ఉమ్మడి గోడ - 59 లింకులు, **ఉత్తరం :** బజార్ - 43 లింకులు.
టైటిల్ హోల్డర్: శ్రీ పెరుమాళ్ల నరసింహా స్వామి (లేటు), తండ్రి : పి. రాజగోపాల రావు
తేది: 06.06.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

రూ.వెయ్యి కోట్ల బీమా క్లెయిమ్..!

- అహ్మదాబాద్ ఘటనలో ఎయిర్ ఇండియా ప్రతిపాదన
- పరిశ్రమలోనే అతిపెద్దది..!
- ఇన్సూరెన్స్ కంపెనీల షేర్లపై ఒత్తిడి

న్యూఢిల్లీ : అహ్మదాబాద్ సమీపంలో గురువారం జరిగిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ ప్రమాదంలో 240 మందికి పైగా మరణించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఎయిరిండియా రూ.1,000 కోట్ల పైగా బీమా క్లెయిమ్‌లకు దరఖాస్తు చేయనుందని అంచనా. ఇది భారత బీమా రంగంలోనే అతి పెద్ద చెల్లింపుగా మారవచ్చని తెలుస్తోంది. ప్రయాణీకుల మరణాలు, థర్డ్ పార్టీ నష్టాలకు క్లెయిమ్‌లు నమోదు చేయడానికి వీలుందని బీమా పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విమాన నష్టం, ప్రయాణీకుల మరణాలు, థర్డ్ పార్టీ నష్టాల బాధ్యత భారీగా ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఈ బీమా క్లెయిమ్ దేశంలోని మొత్తం విమానయాన రంగం బీమా రంగానికి సేకరించిన మొత్తం వార్షిక ప్రీమియం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

20 బిలియన్ డాలర్ల ఏవియేషన్ ఇన్సూరెన్స్ ప్రోగ్రాంలో ఎయిరిండియా తన విమానాలకు బీమా చేసింది. టాటా ఎఐజి గ్లోబల్ కన్సోరియంగా ఇతర భారత బీమా కంపెనీలైనా ఐసిఐసిఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, న్యూ ఇండియా అస్యూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లు ఇందులో ఉన్నాయి. ఈ సంస్థలు సంయుక్తంగా ప్రస్తుత ప్రమాదానికి చెల్లింపులు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. తాజా దుర్ఘటనతో రెండు ప్రభుత్వ రంగ బీమా సంస్థల షేర్లు పతనమయ్యాయి. శుక్రవారం న్యూ ఇండియా అస్యూరెన్స్ షేర్ 2.37 శాతం నష్టపోయి రూ.186.85 వద్ద ముగియగా.. జనరల్ ఇన్సూరెన్స్ 0.56 శాతం తగ్గి రూ.391.85 వద్ద నమోదయ్యింది.

"విమాన నష్టం ఏవియేషన్ హల్ ఆల్ రిస్క్ విభాగం కిందకు వస్తుంది. విమానం విలువను దాని విడిభాగాలు, పరికరాలతో పాటు బీమా పరిధిలోకి వస్తాయి. 2013లో విటి ఎబిఎన్ డ్రీమ్‌లైనర్ డెలివరీ చేయబడినప్పటికీ ఈ ప్రమాదానికి గురైన విమానానికి 2021లో 115 మిలియన్ డాలర్ల (రూ.900 కోట్లు పైగా) బీమా చేయబడింది. నష్టం పాక్షికమైనా లేదా మొత్తమయినా, విమానయాన సంస్థ ప్రకటించిన విలువ ఆధారంగా నష్టం కవర్ చేయబడుతుంది. విమానం విలువ సహా మరణించిన ప్రయాణీకులకు పరిహారం, థర్డ్ పార్టీ నష్టాలను బీమా సంస్థలు భరించాల్సి ఉంటుంది." అని ఇన్సూరెన్స్ బ్రోకరేజీ సంస్థ హౌడెన్ ఇండియా ఎండి, సిఇఒ అమిత్ అగర్వాల్ పేర్కొన్నారు.

మాంట్రియల్ కన్వెన్షన్ అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం.. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరి కుటుంబానికి సుమారు రూ.1.5 కోట్ల వరకు బీమా పరిహారం చెల్లించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఎయిర్ ఇండియా కొనుగోలు చేసిన బీమా కవరేజీపై ఆధారపడి వాస్తవ చెల్లింపు ఉంటుంది. విమానం నివాస గృహాలపై కూలిపోవడంతో, విమానయాన సంస్థకు థర్డ్ పార్టీ ఆస్తి నష్టం బాధ్యత కూడా ఉంటుందని ప్రుడెంట్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ వైస్ ప్రెసిడెంట్ హితేష్ గిరోత్రా వివరించారు. ప్రాణాలు కోల్పోయిన వారి బంధువులకు మొత్తంగా సుమారు రూ.360 కోట్ల పరిహారం అందవచ్చని అంచనా. "విమానం వయసు, తయారీని బట్టి సుమారు రూ.680-980 కోట్లు ఉండొచ్చు" అని గిరోత్రా తెలిపారు. దీని ప్రకారం ఎయిర్ ఇండియా నష్టపోయిన విమానానికి భారీ మొత్తంలో బీమా పరిహారం లభించనుందన్నారు.

విమాన ప్రమాదంపై సిపిఎం విచారం

- సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్

న్యూఢిల్లీ : అహ్మదాబాద్ నుండి లండన్‌కు వెళుతున్న ఎయిర్ ఇండియా విమానం ఘోర ప్రమాదానికి గురై మొత్తంగా 265మంది మరణించడం పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. ఈ దుర్ఘటనలో మృతి చెందిన ప్రయాణికులు, సిబ్బంది కుటుంబాలకు, వైద్య విద్యార్థులు, డాక్టర్ల కుటుంబ సభ్యులకు సంతాపాన్ని, సానుభూతిని తెలియజేసింది. భారత ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు నివారించడానికి తగిన భద్రతా చర్యలను అమలు చేయాలని పొలిట్‌బ్యూరో కోరింది.

ఐద్వా దిగ్భ్రాంతి

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఐద్వా పేర్కొంది. టేకాఫ్ అయిన క్షణాల వ్యవధిలోనే కుప్పకూలి అనేక కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చిందని తెలిపింది. ఈ విషాదకర ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేసింది.

ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథ

అహ్మదాబాద్ : అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఒక్కో కుటుంబానికి ఒక్కో దీన గాథ. రషీద్ పటేల్ తన మేనల్లుడు కోసం వెతుకుతున్నాడు. ఇందుకోసం అతని సోదరి రక్త నమూనాలు ఇచ్చింది. రక్త నివేదిక వచ్చిన తరువాత మృతదేహం ఇస్తామని వైద్యులు తెలిపారు. భరూచ్ ప్రాంతానికి చెందిన ఆ యువకుడి వయస్సు కేవలం 25 ఏండ్లు. పైచదువుల కోసం లండన్ వెళ్తూ విమాన ప్రమాదంలో మరణించాడనిరషీద్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశాడు.

పాయెల్ బెన్ తన తల్లి సరళాబెన్, మేనకోడలి కోసం వెతుకుతున్నాడు. విమానం కూలిన సమయంలో ఆమె వంట చేస్తోంది. ఆ సమయంలోనే ఈ విషాదకర ఘటన గురించి పాయెల్‌కు తెలిసింది. ప్రకాశ్ భాయ్.. తన అల్లుడి కోసం ఆస్పత్రి వద్ద వేచి ఉన్నాడు. తన అల్లుడిని విమానాశ్రయంలో దింపి, ఇంటికి చేరుకున్నాడు. ఇంతలోనే విమానం కూలిపోయిందనే వార్త. ఇప్పుడు ఆయన కుటుంబం సివిల్ ఆస్పత్రిలో రక్త నమూనాలిచ్చింది. తన అల్లుడు పదేళ్లుగా లండన్‌లో నివసిస్తున్నాడని, ప్రమాదం జరిగిన రోజు కూడా ఇండియా నుంచి మళ్లీ లండన్‌కు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడని ప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

నాగ్‌పూర్‌కు చెందిన మనీశ్ కామ్‌దార్ తన కుమార్తె, మనవడు, కుమార్తె అత్తగారి కోసం ఆస్పత్రి వద్ద నిరీక్షిస్తున్నాడు. ఆయన ఇమ్మిగ్రేషన్ అధికారులపై అవినీతి ఆరోపణలు చేశాడు. నా మనవడు రుద్ర నాగ్‌పూర్‌లో జన్మించాడు. కానీ పాస్‌పోర్ట్‌లో అతను బ్రిటీష్ పౌరుడిగా నమోదై ఉంది. దీనిని ఆసరాగా తీసుకుని ఇమ్మిగ్రేషన్ అధికారులు మా నుంచి 1000 పౌండ్లు లంచం తీసుకున్నారు. ఆ తరువాత వారిని విడిచిపెట్టారు. అయితే ఇమ్మిగ్రేషన్ అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించి, రుద్రను ఆపి ఉంటే, నా మనవడు ఇప్పుడు బతికి ఉండేవాడు అని మనీశ్ కామ్‌దార్ ఆవేదన వ్యక్తం చేశాడు. విమానం కూలిపోయిన ప్రదేశంలో ఒక కుటుంబం టీ షాపు నడుపుతోంది. ప్రమాద సమయంలో 15 ఏండ్ల బాలుడు ఆకాశ్ అక్కడే ఉన్నాడు. దీనితో అతను మంటల్లో చిక్కుకుని మరణించాడు. అతనిని కాపాడడానికి వెళ్లిన తల్లి కూడా మంటల్లో చిక్కుకుంది. ప్రస్తుతం ఆమె ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఈ విధంగా ఎవరిని కదిలించినా కన్నీళ్లే ఉబికి వస్తున్నాయి.

50 మందికిపైగా మెడికోలు మృతి?

అహ్మదాబాద్ : అహ్మదాబాద్‌లోని బిజె మెడికల్ కాలేజీ యుజి హాస్టల్ భవనాలపై ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన ప్రమాదంలో 50 మందికిపైగా మెడికోలు మృతి చెందారు. రెండో రోజు శుక్రవారం కూడా గుజరాత్ ప్రభుత్వం ఎలాంటి అధికారిక సమాచారం వెల్లడించలేదు. గురువారం అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఫ్లైట్ నెంబర్ ఎఐ-171 కొన్ని నిమిషాల్లోనే ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. మేఘానిలోని జనావాసాలపై, అక్కడే ఉన్న బిజె మెడికల్ కాలేజీ యుజి హాస్టల్ భవనాలపై విమానంలోని కొన్ని భాగాలు పడ్డాయి. ఈ ప్రమాదంలో 50 మంది వరకూ వైద్య విద్యార్థులు మరణించినట్లు, అనేకమంది గాయపడినట్లు స్థానిక మీడియా చెబుతోంది. ప్రస్తుతం కళాశాల నడుస్తుండటం, పైగా ప్రమాదం భోజన సమయంలో జరగడం వంటి కారణాలతో మృతుల సంఖ్య ఇంకా భారీగానే ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల మరణించడంతో పాటు కాలేజ్ మెస్‌లో కుక్‌గా పనిచేస్తున్న ఠాగూర్ రవి ˆల్లి, రెండేళ్ల కుమార్తె ఈ ప్రమాదం తరువాత నుంచి ఆచూకీ లేకుండా పోయారు. స్థానికులు కూడా పదుల సంఖ్యలో గాయపడ్డారు. వీరందరికీ అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం గురించి గుజరాత్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ధనంజయ్ ద్వివేది మాట్లాడుతూ విమానం కూలిపోవడంతో విద్యార్థుల హాస్టల్, స్టాఫ్ క్వార్టర్స్, అనేక నివాస గృహాలు దెబ్బతిన్నాయని చెప్పారు. క్షతగాత్రులకు పూర్తి స్థాయిలో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

ఊహించని విషాదం

(మొదటిపేజీ తరువాయి)

కచ్చితమైన కారణాలేమిటో తెలుసుకునే వీలు కలుగుతుంది.

సమగ్ర తనిఖీలకై ఆదేశాలు

బోయింగ్ విమానాలన్నింటినీ భద్రతాపరమైన తనిఖీలు చేపట్టాల్సిందిగా శుక్రవారం ఎయిర్ ఇండియాను పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డిజిసిఎ) ఆదేశించింది. మొత్తంగా తనిఖీలపై సమగ్ర నివేదికను అందజేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. విమానాలు బయలుదేరడానికి ముందుగా ఇంధన తనిఖీ, ఎలక్ట్రానిక్ ఇంజన్ల నియంత్రణా వ్యవస్థ, హైడ్రాలిక్ వ్యవస్థ, కేబిన్ ఎయిర్ కంప్రెసర్, టేకాఫ్‌కు సంబంధించిన ప్రక్రియ అంతా సజావుగా వుందా లేదా అనేది తప్పనిసరిగా పరిశీలించాలని కోరింది. డిజిసిఎ ప్రాంతీయ కార్యాలయాల సమన్వయంతో ఈ చర్యలు చేపట్టాలని కోరింది. ఎయిర్ ఇండియాలో ప్రస్తుతం 26 బోయింగ్ విమానాలున్నాయి.

హెల్ప్ సెంటర్ల ఏర్పాటు

బాధితుల కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయం అందించేందుకు గానూ అహ్మదాబాద్, ముంబయి, ఢిల్లీ, గట్విక్ ఎయిర్‌పోర్టుల్లో ఎయిర్ ఇండియా హెల్ప్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అహ్మదాబాద్‌కు వెళ్లడానికి కుటుంబ సభ్యులను ఈ కేంద్రాలు సాయపడతాయని ఎయిర్ ఇండియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి తోడు దేశంలో, విదేశాల నుండి ఫోన్ చేసేందుకు హాట్‌లైన్ నెంబర్లను కూడా ఏర్పాటు చేసింది.

మృతుల గుర్తింపు కోసం డిఎన్ఎ పరీక్షలు

అహ్మదాబాద్‌లో విమానం కూలిన ఘటనలో మృతుల గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం సివిల్ ఆస్పత్రిలో శవపరీక్షలు పూర్తి చేసినట్టు వైద్యాధికారులు ధ్రువీకరించారు. కుటుంబీకుల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్నామని అహ్మదాబాద్ ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ధనుంజయ్ ద్వివేది వెల్లడించారు. డీఎన్ఏ ప్రక్రియ పూర్తి చేసిన మృత దేహాలను బంధువులకు అప్పగిస్తున్నామని తెలిపారు.

ఇప్పటి వరకు గుర్తించింది ఆరుగురినే!

ఇప్పటివరకూ ఆరుగురి మృతదేహాల ముఖాలను గుర్తించి, వారి కుటుంబాలకు అప్పగించినట్టు పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం 215 మంది బాధిత కుటుంబాలు తమను సంప్రదించారని, వారి నుంచి డీఎన్ఏ నమూనాలు సేకరిస్తున్నట్టు చిరాగ్ పోలీసు అధికారి గోసాయి వివరించారు. డీఎన్ఏ ప్రక్రియ పూర్తిచేసేందుకు దాదాపు 72 గంటల సమయం పడుతుందని ఆయన స్పష్టం చేశారు. మృతదేహాలను గుర్తించాక, శవపరీక్షలు నిర్వహించిన తర్వాత కుటుంబాలకు అప్పగిస్తామని ఆయన చెప్పారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు తెలిపారు.

ఇజ్రాయిల్ దాడులకు ముగింపు పలకాలి

- ఇరాన్‌పై దాడులను తీవ్రంగా నిరసించిన సిపిఎం

న్యూఢిల్లీ : ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) తీవ్రంగా నిరసించింది. తక్షణమే ఈ మిలటరీ ఆపరేషన్లను నిలిపివేయాలని డిమాండ్ చేసింది. అంతర్జాతీయ చట్టాలను, ఒప్పందాలను ఉల్లంఘిస్తూ, తన ఇష్టం వచ్చినట్లుగా పశ్చిమాసియాలోని దేశాలపై దాడులు జరుపుతూ ఇజ్రాయిల్ ఒక దుర్మార్గపు దేశంగా వ్యవహరిస్తోందని ఈ దాడులతో మరోసారి రుజువైందని విమర్శించింది. ఈ మేరకు సిపిఎం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది.

ఇజ్రాయిల్, ఇరాన్‌పై పలుమార్లు దాడులు చేసింది. ఈ దాడుల్లో సీనియర్ అణు శాస్త్రవేత్తలు, ఆర్మీ జనరల్స్, పలువురు పౌరులు మరణించారు. ఈ దాడి కోసం ముందుగానే నెలల తరబడి ప్రణాళికలు రచించినట్లు ఇజ్రాయిల ˆఅధికారుల ప్రకటనల ద్వారా తెలుస్తోంది. యావత్ పశ్చిమాసియా ప్రాంతంపై ఇజ్రాయిల్ గుత్తాధిపత్యాన్ని స్పష్టం చేయడమే ఈ దాడుల లక్ష్యంగా కనిపిస్తోంది. అమెరికా అధికారికంగా చేసిన ప్రకటనలతో సంబంధం లేకుండా చూస్తే, ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో అమెరికా మద్దతు లేకుండా ఇంతటి స్థాయిలో మిలటరీ ఆపరేషన్ అమలు చేయడం సాధ్యం కాదన్నది సుస్పష్టం. ఈ మద్దతు లేకుండా ఇజ్రాయిల్‌కు అంత ధీమా రాదు లేదా ఇలాంటి దూకుడుతో కూడిన మిలటరీ ఆపరేషన్ అమలుచేసే సామర్థ్యం వుండదు.

ఇజ్రాయిల్ అణ్వాయుధాలు కలిగివుందనేది అందరికీ తెలిసిన వాస్తవమే, కానీ ఆ ప్రాంతంలోని ఇతర దేశాలు శాంతియుత ప్రయోజనాల కోసమైనా అణు సాంకేతికతను అభివృద్ధి పరుచుకోకుండా అడ్డం పడాలని ఇజ్రాయిల్ చూస్తోంది. అణు అంశాలపై ఇరాన్‌తో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఈ దాడి జరగడంతో మరింత విస్తృతమైన స్థాయిలో ప్రాంతీయ ఘర్షణలు పెచ్చరిల్లే అవకాశం వుంది. పశ్చిమాసియా మొత్తంగా తీవ్రమైన అస్థిరతలో కూరుకుపోయే ప్రమాదముంది. గత 20మాసాలుగా, పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండ కొనసాగిస్తూనే వుంది. ఇప్పుడు, ఇరాన్‌పై ఈ దాడితో, ఈ ప్రాంతంలో తన ఆధిపత్యానికి సవాలు ఎదురవుతుందనుకుంటే వెంటనే దాన్ని నిర్మూలించాలని ఇజ్రాయిల్ భావిస్తోంది.

ఐక్యరాజ్య సమితి నేతృత్వంలో అంతర్జాతీయ సమాజం ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే జోక్యం చేసుకుని ఇజ్రాయిల్ దాడులకు చరమగీతం పాడాలి. ఈ దాడిని ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. భారత ప్రభుత్వం కూడా తన వాణిని వినిపించాలి. తక్షణమే మిలటరీ ఆపరేషన్లను విరమించాల్సిందిగా ఇజ్రాయిల్‌ను కోరాలి. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో గురువారం పాలస్తీనాకు మద్దతుపై జరిగిన ఓటింగ్‌కు భారత్ గైర్హాజరవడం అత్యంత విచారకరం. ఇటువంటి చర్యలు ఇజ్రాయిల్‌కు మరింత ధైర్యాన్ని కల్పించడానికి, ఈ ప్రాంతంలో తన దాడులను కొనసాగించడానికి మాత్రమే ఉపయోగపడతాయి. ఇరాన్, పాలస్తీనాలతో భారత్‌కు దీర్ఘకాల సంబంధాలు వున్నాయి. వాటిని గౌరవిస్తూ, బలోపేతం చేసుకోవాల్సిన అవసరం వుంది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు పరోక్షంగా ఇస్తున్న మద్దతుకు స్వస్తి పలికి, పశ్చిమాసియాలో శాంతి, న్యాయం కోసం స్పష్టమైన వైఖరి తీసుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

పేట్రేగిపోతున్న ఇజ్రాయిల్

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. ఈ దాడుల్లో నాటంజ్‌లోని అణు ఇంధన సమృద్ధి కేంద్రం, టెహరాన్ సమీపంలోని పార్చిన సైనిక స్థావరం, ఇతర సైనిక స్థావరాలు ధ్వంసమయ్యాయని తెలిపింది.

మా ప్రమేయం లేదు : అమెరికా అధికారులు

ఈ దాడితో అమెరికాకు ఎలాంటి సంబంధం, ప్రమేయం లేదని ఇద్దరు అమెరికా అధికారులు స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ ఏకపక్షంగా దాడికి దిగిందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు అమెరికన్ మీడియా వర్గాలు తెలిపాయి.

పలు దేశాల ఖండన

ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడిందని, ఇది ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని ఉల్లంఘించడమేనని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ విమర్శించారు. ఇరాన్ అణు కార్యక్రమంపై ఒక ఒప్పందం కుదుర్చుకోవడానికి దౌత్య ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో ఇజ్రాయిల్ వాటిని నాశనం చేసేలా ఇలాంటి చర్యలకు దిగడాన్ని రష్యా ఖండించింది. రష్యా సహకారంతో నిర్మించిన బుషర్ అణు విద్యుత్ ప్లాంట్‌పై దాడి జరగలేదని తెలుస్తోంది.

ఉద్రిక్తతలు తగ్గించండి : ఐరాస, పలు దేశాలు

తక్షణమే ఇరు పక్షాలు ఉద్రిక్తతల తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని పోలండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి కోరారు. ఇలాంటి దాడుల వల్ల ప్రమాదకరమైన పర్యవసానాలు తలెత్తే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇరాన్‌పై దాడి నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి అణు పర్యవేక్షక సంస్థ ఐఎఇఎ బోర్డు ప్రత్యేకంగా సమావేశమైంది. బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా, న్యూజిలాండ్, టర్కీ ఈ దాడులను ఖండించాయి. ఉద్రిక్తతల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరాయి. ఇది రెచ్చగొట్టే చర్య అని టర్కీ అధ్యక్షుడు ఎర్డొగన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఇజ్రాయిల్ చర్యను సమర్ధించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

సమయం మించి పోలేదు, ఒప్పందం కుదుర్చుకోండి
అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ఈ పరిస్థితుల్లో అమెరికాతో వెంటనే అణు ఒప్పందం కుదుర్చుకోవాలని అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను కోరారు. ఇజ్రాయిల్ దాడులతో పరిస్థితులు మరింత అధ్వానంగా మారతాయని ఆయన హెచ్చరించారు. దాడుల నేపథ్యంలో మొదటిసారిగా స్పందిస్తూ, "ఈ మారణహోమానికి అంతం పలకడానికి ఇంకా సమయం వుంది. ఇప్పటికే ప్రణాళిక ప్రకారం రూపొందించిన దాడులు మరింత దారుణంగా, క్రూరంగా వుండబోతాయి." అని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ దాడులు అద్భుతమని ట్రంప్ వ్యాఖ్యానించారు.

దాడులకు ముందుగా పలు కోవర్టు ఆపరేషన్లు !
ఇరాన్‌లోనే రహస్య స్థావరాలు

ఇరాన్‌పై దాడులకు తెగబడడానికి ముందుగా ఇజ్రాయిల్ పలుమార్లు కోవర్ట్ ఆపరేషన్లు చేపట్టినట్లు ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ మొసాద్ వెల్లడించింది. ఈ ఆపరేషన్‌కు ముందుగా ఇరాన్‌లో రహస్యంగా పేలుడు పదార్ధాలతో కూడిన డ్రోన్ స్థావరాన్ని మొసాద్ నిర్మించినట్లు ఇజ్రాయిల్ అధికారిని ఉటంకిస్తూ మీడియా తెలిపింది. టెహరాన్ సమీపంలోని బాలిస్టిక్ క్షిపణి లాంచర్లపై దాడులకు వీటిని ఉపయోగించినట్లు చెప్పారు. ఆయుధాలతో నిండిన పలు వాహనాలను ఇరాన్‌లోకి అక్రమంగా రవాణా చేశారు. సెంట్రల్ ఇరాన్‌లో విమాన విధ్వంసక వ్యవస్థలు గల స్థావరాలకు సమీపంలో అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగల క్షిపణులను మొసాద్ కమాండోలు మోహరించారు. ఇందుకు సంబంధించిన పుటేజీని కూడా ఆ సంస్థ విడుదల చేసింది.

నంటాజ్ అణు కేంద్రంలో అణు ధార్మికత?

ఇజ్రాయిల్ దాడి తర్వాత నంటాజ్ అణు కేంద్రం లోపల రసాయన చర్య లేదా అణు ధార్మికత వెలువడిందని కనుగొన్నారు. ఇదంతా కూడా అణు సముదాయానికి లోపలే తప్ప వెలుపల కాదని ఇరాన్ అణు ఇంధన సంస్థ వెల్లడించింది. ప్లాంట్‌కు వెలుపల ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆ సంస్థ చీఫ్ మహ్మద్ ఇస్లామి చెప్పారు. అణు కేంద్రం లోపల ప్రక్షాళన పనులు అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు తెలిసిన సమాచారం ప్రకారం ఈ దాడులతో జరిగిన నష్టం ఉపరితల ప్రాంతాలకే పరిమితమైందని చెప్పారు.

మధ్య ప్రాచ్యానికి మిలటరీ వనరులను తరలిస్తున్న అమెరికా

నౌకలతో సహా మిలటరీ వనరులను పెద్ద ఎత్తున పశ్చిమాసియా ప్రాంతానికి తరలిస్తున్నట్లు అమెరికా అధికారులు ఇరువురు మీడియాకు తెలిపారు.

కోర్ ఏరియాలో రూ.1052 కోట్లతో సదుపాయాలు

(మొదటిపేజీ తరువాయి)

కూడా చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాంతంలో సెక్రటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఉన్నతాధికారులు, జడ్జిల భవనాలు ఉండనున్నాయి. వీటిల్లో విద్యుత్, రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ వంటి సదుపాయాల కోసం రూ.1052 కోట్లు వెచ్చించనున్నారు. గ్రీన్ అండ్ బ్లూ ప్లానింగుపైనా ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. కరకట్ట విస్తరణతోపాటు, రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆమోదించిన ప్లానును అమలు చేయాలని సిఎం అధికారులకు సూచించారు. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు వీలుగా 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ జోన్ ఏర్పాటు చేయాలనీ తీర్మానించారు. పధాన పనుల బాధ్యతను సిఆర్‌డిఏ నుండి ఎడిసికి బదలాయించే అంశంపై చర్చించారు. ఇప్పటికే పనుల బాధ్యతను బదలాయించినందున అధికారులతో సమస్యలు లేకుండా చూడాలని, ఎక్కడా పొరపాట్లు జరగరాదని ఆదేశించారు. సిసిడిఎంసి బాధ్యతలపైనా ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణతోపాటు, సిఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION

`E' Procurement Notice
No.11/VMC/CDB/2025-26, Dt.13-06-2025

Roads, Pipe lines, Toilets, Drain, Culvert, Water supply, repairs (Total 130 works)-Est. Amount Rs.2392.57 Lakhs.

All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of

Further details and any corrigendum can be seen@
www.tenderapeprocurementoovin.

S/d-
For COMMISSIONER

HDFC BANK
We understand your world

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ : నమోదిత కార్యాలయం : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (పశ్చిమం), ముంబాయి-400013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-తింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (తూర్పు), ముంబాయి-400042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్‌ఫోలియో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు బహిరంగ నోటీసు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంకు") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది.
అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లెడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ బప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లెడ్జీగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి **21 జూన్, 2025**న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించాలని/డిస్పోస్ చేయాలని నిర్ణయించింది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

క్ర సం.	లోన్ అకౌంట్ నెం.	రుణగ్రహీతల పేరు	10 జూన్, 2025 నాటికి బకాయి మొత్తం (భారత రూపాయలలో)	విక్రయ నోటీసు తేదీ
1	XXXXXXXXXX4112	వల్లూరి వెంకట నాగేశ్వర ప్రేమ్ రాజు	2,00,863.68	11-06-2025
2	XXXXXXXXXX7963	డి వి ఎస్ వీరభద్రరావు	1,941.30	11-06-2025
3	XXXXXXXXXX2984	గునపల్లి వెంకట సత్యాదేవి	11,98,528.13	11-06-2025
4	XXXXXXXXXX3943	శేఖర్ గుండాల	2,49,102.86	11-06-2025
5	XXXXXXXXXX5828	పచ్చిపులుసు వెంకటేశ్వర్లు	5,501.99	11-06-2025

తేది : 13.06.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

డిసిబి బ్యాంక్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : 601 & 602, పెనిన్సుల బిజినెస్ పార్క్, 6వ అంతస్తు, టవర్ ఎ, సేనాపతి బాపత్ మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400 013

డిసిబి బ్యాంక్

బహిరంగ ప్రకటన

అభరణాల వేలం కమ్ ఆహ్వాన నోటీసు

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు **డిసిబి బ్యాంక్ లిమిటెడ్** నుండి అభరణాలు ఎదురుగా వారిచే పొందిన రుణసౌకర్యాలు మొత్తం బకాయిలు చెల్లించుటకు నోటీసులు జారీచేయబడినాయి. మొత్తం బకాయిలు చెల్లించుటలో వారు విఫలమైన కారణంగా తాకట్టుపెట్టిన అభరణాల వేలం నిర్బంధంగా మేము నిర్వహిస్తున్నాము. డిసిబి **బ్యాంక్ లిమిటెడ్** ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతా(లు) తొలగించుట/వేలం తేది(లు) మార్చే అధికారం కలదు. **21.06.2025న మ.12:00 గం.ల నుండి మ.03:00 గం.ల వరకు వేలం https://egold.auctiontiger.net on** ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించబడును.

క్ర సం	ఖాతాదారుని ఐడి	ఖాతాదారుని పేరు	ప్రాంతం/ప్రదేశం
1	102852379	బండారు స్వాతి	విజయవాడ
2	107105129	కొల్ల వేణు	విజయవాడ
3	104265372	ఆవుల రుక్మిణి	ఆకివీడు
4	105984273	అడబాల నాగ సోమేశ్వర ఆర్	ఆకివీడు
5	104419140	ఆవుల దుర్గ	ఆకివీడు
6	101282356	చల్లా శ్రీనివాసరెడ్డి	నల్లపాడు
7	107708412	పెనుమత్స రామరాజు	విశాఖపట్నం
8	106114774	గార వెంకట్రావు	విశాఖపట్నం
9	102784957	ముంచెంగ్లె సుందర్ నాయర్	విశాఖపట్నం
10	107634512	దట్టి దుర్గా ప్రసాద్	విశాఖపట్నం
11	105625616	తంపర సీతారామ్	విశాఖపట్నం
12	106031370	వామరాజు రామకృష్ణ	గుంటూరు
13	103024072	వై వి ఎస్ స్రేంద్ర కుమార్	గుంటూరు
14	105652537	జగత రామకృష్ణ	కాకినాడ
15	106339076	గుండ రవిశంకర్	కాకినాడ
16	105920540	గంటి నీలిమ	రాజమండ్రి
17	106078332	బండారు కవిత	రాజమండ్రి
18	107640636	మధుర బేగం	రాజమండ్రి
19	102686813	బులుసు వ్యాఘ్రీ రమణ్	రాజమండ్రి
20	105994899	అడపా శారద	రాజమండ్రి
21	106695417	మొండి గణేష్	రాజమండ్రి
22	107456776	పుక్కల ఉషారాణి	విశాఖపట్నం
23	107561333	కొలపర్తి నాగశేషు	విశాఖపట్నం
24	106352298	కోడ జాన్	విశాఖపట్నం
25	107661174	అల్ల వంశీ ప్రసాద్	విశాఖపట్నం
26	107757155	కరణం వెంకట నాయుడు	విశాఖపట్నం
27	104481850	పాలకొండ లక్ష్మి	విశాఖపట్నం
28	102304535	పిట్ల పార్వతి	విశాఖపట్నం
29	106345073	కంద్రేగుల కుసుమ	విశాఖపట్నం
30	104279071	యడ్ల నరసింహ సూర్య ప్ర	విశాఖపట్నం
31	106698487	పింగలి లలిత భవాని	విశాఖపట్నం
32	102547461	ఎర్ర రమణ	విశాఖపట్నం
33	103207779	దేవవరపు రాంబాబు	పాయకరావుపేట
34	107855477	కోరుప్రోలు స్వామి	పాయకరావుపేట
35	107727850	దొడ్డిపట్ల చిట్టిబాబు	పాయకరావుపేట
36	105753191	సమయమంతుల సత్యనారాయణ	పాయకరావుపేట
37	103836735	గుండు ఉమేష్ చందు	చిట్టివలస
38	107792523	లక్కింశెట్టి దోల సుధ	పేరూరు
39	107550913	మెట్టి శ్రీలత	పేరూరు
40	102910856	బల్ల సుబ్బారావు	పేరూరు
41	105434689	వడపల్లి మంగ విష్ణు పి	విజయనగరం
42	106208006	ఏడురేషపు అజయ్	విజయనగరం
43	105434506	వడపల్లి నాగ వెంకటచ	విజయనగరం
44	106487856	పనస జయలక్ష్మి	విజయనగరం
45	105862894	బోయ దొరబాబు	అనంతపురం
46	106408965	కొల్ల ముత్యాలన్న	అనంతపురం
47	107658281	కట్ట తిమ్మారెడ్డి	అనంతపురం
48	106640797	ఎరుకుల హరీష్	అనంతపురం
49	102833360	రాజ్‌పురోహిత్ విక్రమ్	అనంతపురం
50	106393432	ఎస్ అల్లాబక్ష్	అనంతపురం
51	106982177	కంచి సౌజన్య	అనంతపురం
52	105541916	పి.రజియా బీ	అనంతపురం
53	106113535	బొమ్మకంటి మహేశ్వరి	కర్నూలు
54	106172185	బెత్స రమేష్	కర్నూలు
55	105645044	నాగ ప్రతాప్ రెడ్డి	కర్నూలు
56	106473977	పఠాన్ యూసఫ్ ఖాన్	కర్నూలు
57	106647233	పొలికి షమీన	కర్నూలు
58	107608376	నలుబొత్తుల రాజ నాయుడు	కర్నూలు
59	107677147	షేక్ అబ్దుల్ బాషా	కర్నూలు
60	106034221	నవీన్ కుమార్	కర్నూలు
61	105445008	చెదుగుండి గోవిందరావు	ఏలూరు
62	106664576	వంక సాయిబాబు	ఏలూరు
63	105577124	చిలకూరు రాజేష్	ఏలూరు
64	104160165	అలపాటి రాము	ఏలూరు
65	106679774	పి.గోపి చంద్	తిరుపతి
66	103090921	కాణిపాకం ఈశ్వరాచారి	తిరుపతి
67	107712908	తానపతి అఖిల	తిరుపతి
68	107393501	అట్లూరు జగదీష్ ప్రసాద్	తిరుపతి
69	106796627	కొరడా శ్రావణి	శ్రీకాకుళం
70	104849016	గోవిందరావు ఇరిగెల	శ్రీకాకుళం
71	104871583	పరిటి జానకి	శ్రీకాకుళం
72	105072483	కడుపు శ్రీకాంత్	శ్రీకాకుళం
73	106117433	గూడూరి నాగార్జున	పైడిపర్రు
74	106843017	సత్తి వెంకటేశ్వరరావు	పైడిపర్రు
75	107120440	కోసూరి జగదీశ్వరి	పైడిపర్రు
76	102838159	కర్రి లీలా సూర్య పద్మావతి	అనపర్తి
77	107707909	డి హేమ గిరి	చిత్తూరు

షెడ్యూల్ వేలం తేది ముందు వరకు ఉన్న వడ్డీ మరియు చార్జీలుతో పూర్తి బకాయిలు చెల్లించే సౌలభ్యం సంబంధిత రుణగ్రహీతలు/తాకట్టుపెట్టిన వారికి చివరిగా ఒక అవకాశం ఇవ్వడమైనది విఫలమైతే ఈ అభరణాలు వేలం వేయడం జరుగుతుంది. ఒకవేళ వేలం సూచించిన వేలం తేదిలలో పూర్తికాలేకపోయినట్లయితే తదుపరి నోటీసు లేకుండా వేలం ఇతర రోజులు కొనసాగించబడును. బిడ్ల వేలం మరియు అంగీకారంలో పాల్గొనడం డిసిబి **బ్యాంక్** యొక్క స్వంత అభీష్టానుసారం ఉంటుంది. వేలం **"ఏది ఎక్కడ ఉందో", "ఉన్నది ఉన్నట్లుగా", "ఏది ఏమైనా ఆ పద్ధతిగా"** మరియు **"ఎలాంటి మద్దతు లేకుండా"** జరుగుతుందిని దయచేసి గమనించగలరు, అభరణాలకు సంబంధించి ఎలాంటి క్లెయిమ్స్, వివాదాలు, అభ్యంతరాలకు డిసిబి **బ్యాంక్** ఏ విధంగానూ బాధ్యత వహించదు. వేలంలో పాల్గొనుటకు బిడ్డరుదారులు వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కొరకు **https://egold.auctiontiger.net** చూడండి.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది : 14.06.2025
సం/- అధికృత అధికారి
డిసిబి బ్యాంక్ లిమిటెడ్

ఇర్ఫాన్ కుటుంబం

ప్రమాదానికి ముందు నఫీజా కుటుంబం ఫైల్ ఫొటో

నేర్చుకుందాం!

పొద్దున్నే నిద్దుర లేవడం
సూర్యుడి నుండి నేర్చుకుందాం!
మౌనంగా, ఓర్పుగా ఉండడం
పుడమిని చూసి నేర్చుకుందాం!
ఎదిగినా ఒదిగి బతకడం
చెట్టును చూసి నేర్చుకుందాం!
కష్టపడి శ్రమించడం
ఎద్దును చూసి నేర్చుకుందాం!

క్రమశిక్షణను, పొదుపును
చీమను చూసి నేర్చుకుందాం!
నిస్వార్థంగా జీవించడం
తేనెటీగతో నేర్చుకుందాం!

నిత్యం అమితానందాన్ని
సీతాకోకలో నేర్చుకుందాం!
అలసత్వాన్ని విడవడం
కెరటం నుండి నేర్చుకుందాం!

కళ్ళు తెరిచి చూద్దాం

బద్ధకాన్ని విడుద్దాం!
ప్రకృతిలో ప్రతి అణువులో
పరమార్థం వెతుకుదాం
ప్రమాణాల స్థాయిని
ప్రయత్నంతో అందుకుందాం!

- పేట యుగంధర్,
94925 71731.

బడికి దారి

బుడిబుడి నడకలు
చిరు అడుగుల సవ్వడులు
అమాయకత్వపు నవ్వులు
ఉత్సాహంతో వేసే ఉరకలు
వికసించే సుగంధాల పువ్వులు!

బడిలో వేసే మొదటి అడుగు
భవిత బంగరు గవాక్షానికి వెలుగు
సాగే కాల గమనంలో
వర్తమాన భవిష్యత్తులకు మధ్య
కలల వారధి బడి !

చదువుల సాగర మథనంలో
కృషి పట్టుదల ప్రతిభలే సాధనాలు
ఆచరణతో గమ్యానికి వేసే
బడికి దారి
అక్షరాల విజయ సోపానమే!

- పట్లొళ్ళ బక్కారెడ్డి,
97053 15250

సరైన పదాలు గుర్తించండి

India Word Search

n	o	o	s	n	o	m	s	o	m
t	s	e	r	o	f	n	i	a	r
c	t	i	g	e	r	s	f	z	p
i	a	b	m	u	m	c	o	w	s
s	f	a	r	m	i	n	g	j	p

cows
farming
monsoon
mumbai
rainforest
tigers

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బాక్సులోని గజిబిజి అక్షరాల్లో పక్కనే ఉన్న ఆంగ్ల పదాలు అడ్డం, నిలువు, వెనుక వరుసల్లో ఉన్నాయి. ఎక్కడున్నాయో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ

యు.అభినవ్ పునీత్,
5వ తరగతి, కర్నూలు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కలలు కూలిన దృశ్యాలు కట్టలు తెగిన కన్నీళ్లు

మృతుల కుటుంబాలకు తీరని వ్యథని మిగిల్చిన గుజరాత్ విమాన ప్రమాదంలో ఒక్కొక్కరిది ఒక్కో కథ. మృతుల్లో 25 ఏళ్ల సాహిల్ పటేల్ ఉన్నాడు. ప్రమాదానికి కొన్ని గంటల వరకు పటేల్ కుటుంబం ఆనందానికి అవధులు లేవు. కారణం, ఏప్రిల్ నెలలో సాహిల్ చిరకాల కలని నిజం చేస్తూ అతనికొక మెయిల్ వచ్చింది. లండన్‌లో రెండేళ్లపాటు వర్క్ చేసుకునే వర్క్ వీసా లాటరీని అతను గెలుచుకున్నాడు. బ్రిటీష్ ప్రభుత్వ యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్‌లో భాగంగా భారత్ నుండి ఎంపికైన 3000 మందిలో అతనొకడు. మెయిల్ అందిన దగ్గర నుండి సాహిల్ ఊళ్లో అతని కుటుంబానికి దక్కిన అవకాశం గురించే మాట్లాడుకున్నారు. అహ్మదాబాద్‌కి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న సరోద్ గ్రామంలో సాహిల్ కుటుంబం ఉంటోంది. వీసా వచ్చిన దగ్గర నుండి సాహిల్ కుటుంబం ప్రార్థనలు చేస్తూనే ఉంది. సాహిల్‌కి వచ్చిన అవకాశంతో తమ మొత్తం కుటుంబ భవిష్యత్తు మారిపోతుందని వారంతా ఎంతో సంతోషించారు. కానీ రెండు నెలలు కూడా గడవకముందే ఆ ఆనందం ఆవిరైంది. విమాన ప్రమాదం రూపంలో సాహిల్ చిరకాల కల మాడి మసై పోయింది.

ఈ ప్రమాదంలో మరణించిన యువతలో అత్యధిక మంది స్కాలర్‌షిప్ ద్వారా లండన్ వెళ్తున్నవారే ఉన్నారు. ఇంకా విషాదమేమంటే విమానంలో ప్రయాణించకుండానే మెడికల్ విద్యార్థులు మరణించడం.

ఎన్నో దు:ఖభరిత దృశ్యాలు

రాకేష్ డియోరా బిజె మెడికల్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 70 మంది విద్యార్థులతో కలిసి అప్పుడే భోజనం చేశాడు. ఈ ప్రమాదంలో విమానం ఆ విద్యార్థులు కూర్చొన్న మెస్‌పైనే పడింది. దీంతో రాకేష్ శిథిలాల కింద నలిగిపోయి చనిపోయాడు. అతను వేసుకున్న తెల్లని కోటు రక్తంతో తడిసిపోయింది.

ప్రమాదం జరిగిన ఐదు గంటల తరువాత మృతదేహాలను అహ్మదాబాద్ సివిల్ హాస్పటల్‌కి తరలించారు. అక్కడికి ఎయిర్ ఇండియా క్రూ మెంబర్ 22 ఏళ్ల ఇర్ఫాన్‌ని వెతుక్కుంటూ అతని కుటుంబం వచ్చింది. అధికారులు ఇర్ఫాన్‌ని గుర్తుపట్టమని తన తండ్రిని మృతదేహాలు ఉన్న చోటుకి తీసుకెళ్లారు. అక్కడ తెల్లని వస్త్రంలో ముఖం మాత్రమే కనిపించేలా చుట్టబడిన ఇర్ఫాన్‌ని చూసి ఆ తండ్రి అక్కడే కుప్పకూలిపోయాడు. 'దేవుడా నా జీవితమంతా నిన్నే కొలిచాను. నా బిడ్డని ఎంతో ఉన్నతంగా పెంచాను. ఇప్పుడు అతన్ని ఇలా చేశావు. నా కొడుకునే ఎందుకు లక్ష్యం చేశావు?" అని బిగ్గరగా ఏడుస్తున్న అతడ్ని ఓదార్చేందుకు అక్కడ ఎవరూ ముందుకురాలేదు. అందరిదీ అదే దు:ఖం.

ఇర్ఫాన్ తల్లి ఈ మరణాన్ని అంగీకరించడం లేదు. హాస్పటల్ బయట తన బంధువులందరూ రోదిస్తుంటే వాళ్లతో ఆమె పోట్లాడుతోంది. 'నా కొడుకు చనిపోలేదు. మీరంతా అబద్ధం చెబుతున్నారు. తిరిగి వస్తానని నాతో చెప్పాడు. వాడు వస్తాడు' అంటున్న ఆ తల్లిని చూసి తనకేమీ కాని వారు కూడా కన్నీరు పెట్టుకున్నారు.

గుమిగూడిన జనంలో సయ్యద్ నఫీజా కుటుంబం కూడా వుంది. వారు అక్కడికి తమ వారి ముఖాలు చూసి గుర్తు పట్టడానికి రాలేదు. నఫీజా ధరించిన పెండెంట్ ద్వారా తనని గుర్తించడానికి వచ్చారు.

హాస్పటల్ ఎదుట రోదిస్తున్న మృతుల బంధువులు

పెను విషాదాన్ని మిగిల్చిన అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. అభం శుభం తెలియని పసిపిల్లలను పొట్టన బెట్టుకుంది. జీవితకాల కలని సాకారం చేసుకోవాలని, విదేశాలకు బయల్దేరిన యువత భవిష్యత్తుని కాల్చి బూడిద చేసింది. ప్రజలకు సేవ చేయాల్సిన వైద్య విద్యార్థులను మంటల్లో మసి చేసింది. ప్రమాదం జరిగిన ఐదు గంటల తరువాత మృతదేహాలన్నీ అహ్మదాబాద్ సివిల్స్ హాస్పటల్‌కి తరలించారు. అక్కడికి చేరిన బంధువుల రోదనలతో ఆ ప్రాంగణమంతా కన్నీరు కార్చింది.

అదొక్కటే తన ఆనవాలు చెబుతుంది. భర్త ఇచ్చిన ఆ పెండెంట్‌ని నఫీజా ఎప్పుడూ ధరించే ఉంటుంది. ఈ ప్రమాదంలో నఫీజాతో పాటు ఆమె భర్త, తన ఇద్దరు పిల్లలు చనిపోయారు. వారంతా లండన్‌లో స్థిరపడ్డారు. కుటుంబ సభ్యులతో 'ఈద్' జరుపుకుందామని కొన్ని రోజుల క్రితమే భారత్ వచ్చారు. ఉన్నన్ని రోజులూ ఎంతో ఆనందంగా గడిపారు. ప్రమాదానికి కొన్ని గంటల ముందు వరకు ఆ కుటుంబంలో సంతోషాలు వెల్లివిరిశాయి. కానీ ఇప్పుడు ఆ నవ్వులు, ఆనందాలు జ్ఞాపకాల్లో మిగిలాయి.

ప్రమాదం జరిగినప్పుడు ఆ ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో 50 ఏళ్ల రిక్షా డ్రైవర్ రాజేష్ స్టాండ్‌లో ప్యాసింజర్ కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ ప్రమాదం అతన్ని కూడా తాకింది. రాజేష్ శిథిలాల కింద పడలేదు. అయినా విమానం నుండి ఎగిసిపడిన మంటలు అతని శరీరాన్ని కాల్చేశాయి. రాజేష్ కుటుంబానికి అతనే ఆధారం. ప్రస్తుతం అతడు సీరియస్ కండిషన్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. రాజేష్ భార్య హాస్పటల్ రూమ్ బయటే ఏడుస్తూ కూర్చొని ఉంది.

ఆ కాలనీపై కూలి ఉంటే ...!

విమానం కూలిన శబ్ధం విని మేఘానినగర్‌లో ఉంటున్న తారాబెన్ బయటికి వచ్చి చూసింది. జనసమూహాలు ఎక్కువగా ఉండే కాలనీ అది. గ్యాస్ లీకై ప్రమాదాలు జరగడం అక్కడ పరిపాటి. తారాబాయి మొదట ఈ ప్రమాదాన్ని అలాగే భావించింది. కానీ కాసేపటికే దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. 'ఊపిరాడకుండా చేసిన ఆ పొగ ఘాటైన వాసనతో ఉంద'ని ఆమె చెప్పింది. కాలనీ వాసులందరూ విమానం కూలినవైపు పరుగులు పెడుతుంటే తారాబాయి కూడా వారితో పాటు పరుగెత్తింది. వెళుతూ వెళుతూ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది. కాలనీ అంతా ఒకదానిపై ఒకటి, ఒకదాన్ని అంటిపెట్టుకుని మరొకటి వేల ఇళ్లు ఉన్నాయి. అప్పుడు తన మనసులో ఇలా అనుకున్నట్లు ఆమె చెప్పింది. 'ఆ విమానం ఇక్కడ కానీ కూలితే ఆ మరణాలు లెక్కించడం ఎవరివల్లా కాదు. ఆ దేవుడు మమ్మల్ని రక్షించాడు. కానీ వందలమందిని ఎత్తుకెళ్లిపోయాడు' అని చెబుతున్నప్పుడు తారాబాయి కళ్ల నుండి నీళ్లు జలపాతంలా కారుతున్నాయి.

మనసును కలచే మరణాలు

మృతులను ఒక్కొక్కరిగా వ్యానుల్లోకి ఎక్కించి హాస్పటల్‌కి తరలిస్తున్న రెస్క్యూ సిబ్బందిలో తోఫిఖ్ మన్సూరీ ఒకరు. అతను ఈ దృశ్యాలను చెబుతూ ఇలా అన్నాడు. 'నేను ఎన్నో ప్రమాదాలను చూశాను. కానీ ఈ ప్రమాదం ఊహించనిది. నాలుగు గంటల పాటు శ్రమించాం. సూర్యుడు అస్తమించే సమయానికి గాని, మృతదేహాలను ఒక్కొక్కటిగా వెలికితీయలేకపోయాం. ఇలాంటి సందర్భాల్లో మేం చాలా నిబ్బరంగా ఉంటాం. సిబ్బంది అంతా ఒకానొక నిశ్శబ్ద స్థితిలోకి వెళ్లిపోతాం. సిద్ధం చేసిన మృతదేహాలను ఒక బ్యాగ్ తరువాత మరొకటిగా అంబులెన్స్‌లోకి ఎక్కించేటప్పుడు చాలా కృతకంగా పనిచేస్తాం. కానీ మేమంతా ఒక బ్యాగ్ దగ్గర ఆగిపోయాం. మా నిబ్బరం, వృత్తిధర్మం అంతా ఒక్కసారిగా విచ్ఛిన్నం అయిపోయింది. అది ఒక చిన్నపిల్ల మృతదేహం ఉంచిన బ్యాగ్. రెండు, మూడేళ్ల వయసు మాత్రమే ఉంటుంది. ఆ చిన్న శరీరం మంటల్లో కాలిపోయిందన్న బాధ ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. ఇట్లాంటి వాటికి మేం ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లోనూ మనసు చలించకుండా ఉండాలని తర్ఫీదు పొందుతాం. కానీ ఆ చిన్న పిల్ల, ఆ బేబీ మృతదేహం నా గుండెని ముక్కలు చేసింది. మేమూ మనుషులమే.. ఇంకెప్పుడూ ఇంటికి తిరిగివెళ్లని ఆ చిన్నబిడ్డని పట్టుకున్నప్పుడు దు:ఖం తన్నుకొచ్చింది. ఈ దృశ్యాలు మాకు చాలా కాలం నిద్రపట్టకుండా చేస్తాయి' అని చెబుతున్నప్పుడు మన్సూర్ తలదించుకుని మౌనంగా ఉండిపోయారు.

ఇట్లాంటి హృదయ విదారకర దృశ్యాలు ఇంకా అహ్మదాబాద్ సివిల్ హాస్పటల్‌లో దర్శనమిస్తున్నాయి. ఎప్పుడు ఎవరు పేరు వినపడుతుందో అని కుటుంబసభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తున్నారు. అందరూ మరణించారని తెలిసినా పేరు పిలిచినప్పుడు గుండెలు బాదుకుంటూ వెళ్తున్న కుటుంబాలని చూసి మిగతా వారు కూడా కంటనీరు పెడుతున్నారు. ఆ ప్రాంతమంతా మూర్తీభవించిన దు:ఖం, విషాదం అలముకొని ఉంది. ఏ సమయంలో ఎవరు గుండెలు బద్దలయ్యేలా రోదిస్తారో తెలియని నిశ్శబ్ద విషాదం ఘనీభవించి ఉంది.



రెండు పాత్రలు చాలా భిన్నమైనవి..

టాలీవుడ్ కథానాయకుడు నాగార్జున ప్రస్తుతం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే 'కుబేర' విడుదలకు సిద్ధంగా ఉంది. మరోవైపు ఆయన నటించిన 'కూలీ' చిత్రం కూడా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి ఓ ఇంటర్వ్యూలో నాగార్జున మాట్లాడారు. దర్శకుడు శేఖర్ కమ్ముల అంటే తనకెంతో అభిమానమని తెలిపారు. 'తనతో 15 ఏళ్లుగా సినిమా చేయాలని చూస్తున్నాను. 'కుబేర'తో ఆ కల నెరవేరింది. శేఖర్ చిత్రాలు మిగతా సినిమాల కంటే చాలా భిన్నంగా ఉంటాయి. అయితే 'కుబేర' కథతో నా దగ్గరికి వచ్చినప్పుడు నేను షాక్ అయ్యాను. 'కుబేర' కోసం శేఖర్ ఎంతో రీసెర్చ్ చేశాడు. న్యాయంపై ఆయనకు బలమైన నమ్మకం ఉంది. ఏదో ఒక స్కామ్‌నో లేదా ఏ ఒక్కరినో ఆధారంగా చేసుకొని ఈ కథ రాయలేదు. సమాజంలో చూస్తున్న విషయాలనే ఇందులో చెప్పారు. పేద, ధనిక, మధ్య తరగతి కుటుంబాల్లో ఏం జరుగుతుందనే దాన్ని ఇందులో చూపించారు. తాను అనుకున్న కథను చాలా అందంగా స్క్రీన్ మీదకు తీసుకు వచ్చాడు' అని చెప్పారు. ఇక 'కూలీ' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో నా పాత్ర కీలకంగా ఉండబోతుంది. ఈ సినిమాలో నన్ను నేను చూసుకుని షాక్ అయ్యాను. దర్శకుడు లోకేష్ కనగరాజ్ నన్ను కొత్తగా చూపించబోతున్నాడు. ఇది పూర్తిగా మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతోంది' అని వివరించారు.

జూన్ 15న 'కుబేర' ప్రీ రిలీజ్

ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన తారగణంగా తెరకెక్కిన 'కుబేర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌పై చిత్రబృందం తాజాగా ప్రకటించింది. జూన్ 20న ప్రేక్షకుల రానున్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ శుక్రవారం నిర్వహించాల్సి ఉండగా దాన్ని వాయిదా వేశారు. గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం దృష్ట్యా ఆ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన కొత్త డేట్‌ను చెప్పారు. జూన్ 15న (ఆదివారం) సాయంత్రం నిర్వహించనున్నట్లు ఉప్రకటించారు. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం జరగనుందని తెలిపింది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మించారు.

పోస్ట్ ప్రొడక్షన్స్ పనుల్లో 'డ్యూడ్'

మల్టీ టాలెంటెడ్ తేజ్ నటిస్తూ కన్నడ-తెలుగు-మలయాళ భాషల్లో దర్శకత్వం వహిస్తున్న త్రిభాషా చిత్రం 'డ్యూడ్'. ఫుట్‌బాల్ నేపథ్యంలో బలమైన భావోద్వేగాలతో సాగే ఈ చిత్రాన్ని ఫుట్‌బాల్ ప్రేమికుడైనకన్నడ సూపర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్‌కు అంకితం చేస్తున్నారు. 80 శాతం షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న 'డ్యూడ్' చిత్రం టీజర్‌ను నిర్మాతలు త్వరలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా తేజ్ మాట్లాడుతూ కథానాయకుడు, దర్శకుడిగా 'డ్యూడ్' చిత్రం ఔట్‌పుట్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నానన్నారు. ఎప్పుడెప్పుడు ఆడియన్స్‌తో కలిసి థియేటర్స్‌లో సినిమా చూసుకుంటామా అని చాలా ఆత్రంగా ఉందన్నారు. త్వరలో టీజర్ రిలీజ్ చేసి, అప్పటి నుంచి ప్రచార కార్యమాలు ముమ్మరం చేస్తామని వివరించారు. రఘు ఫుట్‌బాల్ కోచ్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఇదే ఏడాదిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

టీజర్ లీక్‌పై 'రాజా సాబ్' యూనిట్ అప్రమత్తం

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన సినిమా 'రాజాసాబ్'. డిసెంబర్ 5న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 16న టీజర్‌ను విడుదల చేయటానికి చిత్ర నిర్మాతలు ఏర్పాట్లు చేస్తున్నారు. అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సరిగ్గా ఇలాంటి సమయం లోనే ఎవరో టీజర్‌ని లీకక్ చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో మూవీ టీమ్ అప్రమత్తమైంది. హెచ్చరిస్తూ ట్వీట్ చేసింది. 'రాజాసాబ్ కంటెంట్ ఎవరి సోషల్ మీడియాలోనైనా కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అలానే అకౌంట్ సస్పెండ్ చేయిస్తాం. అందరూ మాకు సహకరిస్తారని అనుకుంటున్నాం' అని మూవీ టీమ్ ట్వీట్ చేసింది. మారుతి దర్శకత్వం వహించిన ఈ సినిమాని ఈ ఏడాది డిసెంబరు 5న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు కొన్నిరోజుల క్రితమే నిర్మాతలు ప్రకటించారు. హారర్ కామెడీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ నటించారు. సంజయ్ దత్ విలన్‌గా చేశారు. తమన్ సంగీతాన్ని అందించారు. షూటింగ్ పూర్తయిన ఈ సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్ ఎక్కువగా ఉండటం వల్ల ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

ఊరిస్తున్న విజయం

- దక్షిణాఫ్రికా లక్ష్యం 282
- ప్రస్తుతం 213/2
- మార్‌క్రమ్ సెంచరీ, బవుమా అర్ధసెంచరీలు

లండన్: ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా ముందు 282పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా జట్టు నిలిపింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 56 ఓవర్లలో 2వికెట్ల నష్టపోయి 213 పరుగులు చేసి విజయానికి చేరువైంది. మార్‌క్రమ్(102) సెంచరీకి తోడు కెప్టెన్ బవుమా(65) అర్ధసెంచరీతో రాణించారు. నాల్గోరోజు సఫారీజట్టు మరో 69పరుగులు చేస్తే తొలిసారి డబ్ల్యుటిసి టైటిల్‌ను కైవసం చేసుకోనుంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 8వికెట్ల నష్టానికి 144పరుగులతో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 207పరుగులకు ఆలౌటైంది. లియాన్(9) త్వరగా పెవీలియన్‌కు చేరినా.. స్టార్క్(58), హేజిల్‌వుడ్(17) చివరి వికెట్‌కు 59పరుగులు చేశారు. లార్డ్స్‌లో ఇప్పటి వరకూ 280కు పరుగుల లక్ష్య ఛేదన రెండుసార్లు మాత్రమే సాధ్యమైంది. ఈ సీజన్‌లో తెంబ బవుమా జట్టు భీకర ఫామ్‌లో ఉంది. 250కు పైగా పరుగుల లక్ష్యాన్ని ఐదుసార్లు సునాయసంగా ఛేదించింది. ఇందులో మూడు ఆస్ట్రేలియాపైనే కావడం విశేషం.

స్టార్క్ అర్ధసెంచరీ..

మూడో రోజు లియన్(2)ను రబడా ఔట్ చేశాక హేజిల్‌వుడ్(17) జతగా స్కార్ట్ ప్రత్యర్థి బౌలర్లను విసిగించాడు. అజేయ అర్ధ శతకం బాదిన ఈ స్పీడ్‌స్టర్ పదో వికెట్‌కు 58పరుగులు రాబట్టాడు. లంచ్‌కు ముందు ఈ ద్వయాన్ని.. మార్‌క్రమ్ విడదీశాడు. దాంతో 207 వద్ద కంగారూ జట్టు రెండో ఇన్నింగ్స్ ముగిసింది. దీంతో తొలి రెండ్రోజులు బౌలర్ల ఆధిపత్యం చెలాయించిన లార్డ్స్ విజేత ఎవరో తేలిపోనుంది. తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగుల ఆధిక్యం సాధించిన ఆస్ట్రేలియా.. రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్‌తో మ్యాచ్‌పై పట్టు బిగించింది. సఫారీ పేసర్లు కబిసో రబడ(4/59), లుంగి ఎంగిడి(3/38)ల ధాటికి ప్రధాన బ్యాటర్లు పెవిలియన్ చేరినా.. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ(43), మిచెల్ స్టార్క్(58 నాటౌట్)ల అసమాన పోరాటంతో జట్టును ఆదుకున్నారు. స్టార్క్‌కు టెస్టుల్లో ఇది 11వ అర్ధసెంచరీ.

లంచ్ విరామం తర్వాత ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా జట్టు ఓపెనర్ రికెల్టన్(6) నిరాశపరిచాడు. దీంతో 9పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన జట్టును మరో ఓపెనర్ మార్‌క్రమ్, ముల్డర్(27) సాయంతో అర్ధసెంచరీతో ఆదుకున్నా డు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు 61 పరుగులు జతచేశారు. టీ విరామ సమయానికి దక్షిణాఫ్రికా 24ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 92పరుగులు చేసింది. మూడోసెషన్‌లో మార్‌క్రమ్ (102), కెప్టెన్ బవుమా(65) మరో వికెట్ పడకుండా ఆసీస్ బౌలర్లను ఎదురొడ్డి పోరాడారు. టైటిల్ ముందు బోల్తా పడే దక్షిణాఫ్రికా జట్టు ఆ నానుడికి చెక్ పెడుతుందేమో.. లేదో.. నేటితో తేలిపోనుంది.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)..

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 212, 207
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 138
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 213/2

మార్‌క్రమ్(102నాటౌట్) బవుమా (65నాటౌట్)

తల్లికి అనారోగ్యంతో భారత్‌కు చేరిన గంభీర్

లండన్: టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇంగ్లండ్ నుంచి భారత్‌కు తిరిగి చేరుకున్నాడు. అతని తల్లి రెండ్రోజుల క్రితం గుండెపోటుకు గురవ్వడంతో ఆఘమేఘాల మీద లండన్ నుంచి బయల్దేరి న్యూఢిల్లీకి చేరుకున్నాడు. గంభీర్ తల్లి గంగారామ్ ఆసుపత్రి ఐసియులో చికిత్స తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఆమెను చూసేందుకు గంభీర్ న్యూఢిల్లీకి చేరుకున్నాడు. శుక్రవారం నుంచి టీమిండియా జట్టు ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడనుంది. ఈ సమయంలోనే కుటుంబంలో అత్యవసర పరిస్థితి తలెత్తడంతో గంభీర్ భారత్‌కు తిరిగి వచ్చినట్లు బిసిసిఐ ఆ ప్రకటనలో పేర్కొంది. దీంతో భారత్-ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌ను అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ పర్యవేక్షించనున్నాడు. అతడికి బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్, ఇతర కోచింగ్ సిబ్బంది సహాయపడతారు. జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో భారత్ తొలి టెస్ట్ ప్రారంభమయ్యే నాటికి అతడు మళ్లీ ఇంగ్లండ్ చేరుకోవచ్చని తెలుస్తోంది.

విమాన ప్రమాద మృతులకు క్రికెటర్ల నివాళి

లండన్: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి టీమిండియా ఆటగాళ్లు నివాళులు అర్పించారు. భారత్-ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్ ప్రారంభ సందర్భంగా ఆటగాళ్లు సహాయక సిబ్బంది నివాళులు అర్పించారు. అనంతరం చేతికి నల్ల బ్యాడ్జీలు ధరించి మ్యాచ్‌ను ఆడారు. దీనిని బిసిసిఐ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. అలాగే ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య లార్డ్ వేదికగా జరుగుతున్న డబ్ల్యుటిసి ఫైనల్ మూడోరోజు ఆట ప్రారంభం ముందు కూడా ఇరుజట్లు ఆటగాళ్లు, గ్యాలరీలో ఉన్న క్రీడాభిమానులందరూ ప్రమాద మృతులకు నివాళులర్పించారు.

శ్రేయస్‌కు మళ్లీ నిరాశ

- ముంబయి టి20 లీగ్ ఫైనల్లో ఓటమి

ముంబయి: శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఉన్న జట్టు మరోసారి ఫైనల్లో తడబడింది. 2025 ఐపిఎల్ ఫైనల్లో పంజాబ్ జట్టుకు సారథ్యం వహించి సంచలన విజయాలతో ఫైనల్‌కు చేర్చిన శ్రేయస్.. టైటిల్ పోటీలో బెంగళూరు చేతిలో ఓటమిపాలయ్యాడు. తాజాగా ముంబయి టి20 లీగ్‌లో సోబో ముంబయి ఫాల్కన్స్‌కి కెప్టెన్‌గా ఉన్న శ్రేయస్.. ఆ జట్టును కూడా ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. కానీ శుక్రవారం జరిగిన ఫైనల్లో సౌత్ సెంట్రల్ మరాఠా రాయల్స్ చేతిలో ఓటమిపాలై మరోసారి టైటిల్‌ను అందుకోలేకపోయాడు. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్లో శ్రేయస్ కెప్టెన్సీలోని సోబో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 157 పరుగులు చేయగా.. మరాఠా బ్యాటర్లు చిన్మయ్ రాజేశ్ అర్ధసెంచీరకి తోడు, సూరత్ బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో ఆ జట్టు 19.2ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68